ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 13 నవంబరు 2025



పుష్కర కాలానికి మోక్షం..!

దొరమామిడి-అలివేరు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు

కొండరెడ్డి గ్రామాల ప్రజల వినతి..

స్పందించిన కూటమి ప్రభుత్వం

బుట్టాయగూడెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):బుట్టాయగూడెం మండలం దొరమామిడి నుంచి అలివేరు వరకు ఆరు కిలోమీటర్ల దూరం. ఈ రెండు ప్రాంతాలను కలుపుతున్న ఈ ప్రధాన రహదారిపై అలివేరు, ఎర్రాయిగూడెం, నిమ్మలపాడు, డోలుగండి, రేపల్లె, రేగులపాడు, లంకపాకల, దొరమామిడి డ్యామ్, మోదేలు గ్రామాల కొండరెడ్లు రాకపోకలు సాగిస్తారు. పదిహేనేళ్ల క్రితం వేసిన ఈ బీటీ రోడ్డు కొన్నాళ్లకే పాడైంది. దాదాపు పుష్కర కాలం నుంచి గోతులతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు ప్రజా ప్రతినిధులను, అధికారులను ఎప్పటికప్పుడు అభ్యర్థిస్తున్నారు. రాళ్లు పైకి లేచి తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డును తలపిస్తోంది. అటవీ ప్రాంతం కావడంతో అడుగడుగునా అవస్థలు పడుతున్నారు. రోడ్డు కోసం కొండరెడ్లు మొరపెట్టుకోని రోజంటూ లేదు. వైద్యం కోసం ఆసుపత్రులకు, ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర పనులపై రాకపోకలు సాగించేందుకు ఇదొక్కటే మార్గం. అది పాడవడంతో అడవి బిడ్డలు నరకయాతన పడ్డారు. గత వైసీపీ సర్కార్ ఈ రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీని నిర్మాణానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.4 కోట్లు మంజూరు చేసింది. తమ మొర ఆలకించిన కూటమి ప్రభుత్వానికి కొండరెడ్లు కృతజ్ఞతలు చెబుతున్నారు. త్వరలోనే పనులు చేపట్టనున్నారు.



జిల్లాలో 15 వేల గృహ ప్రవేశాలు

నూజివీడులో 'మన ఇల్లు - మన గౌరవం' తాళం చెవిని లబ్ధిదారుడికి అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, చిత్రంలో సబ్ కలెక్టర్ వినూత్న 7లో..

బీపీఎస్ వచ్చేసింది



- దరఖాస్తుకు 120 రోజుల గడువు
- అమలుకు మార్గదర్శకాలు విడుదల
- అనధికారిక కట్టడాలు, అంతస్తులు క్రమబద్ధీకరణ

ఏలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో అనధికార భవనాల నిర్మాణాలు, కట్టడాల క్రమబద్ధీకరణకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బీపీఎస్) రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. దీని అమలుకు పురపాల శాఖ బుధవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. డైరక్టర్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ అభ్యర్థన మేరకు రాష్ట్రవ్యాప్తంగా భవనాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇటీవలే గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వగా, తాజాగా విధి విధానాలను రూపొందించి, అమలు బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగిస్తూ నిర్ణయించింది.

- 2025 ఆగస్టు 31వ తేదీ నాటికి అనధికారికంగా నిర్మించిన భవనాలు, అంతస్తులను క్రమబద్ధీకరించుకోవచ్చు.
- కట్టడాలు, అంతస్తుల క్రమబద్ధీకరణ ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీపీఎస్.జీవో.ఇన్ ద్వారా భవన యజమాని దరఖాస్తు చేయాలి.
- దరఖాస్తుదారుడు, ఓవర్, రిజిస్ట్రర్డ్ అసోసియేషన్లు విధిగా గతంలో మంజూరు పొందిన ప్లాన్, అతిక్రమణ వివరాల డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- వ్యక్తిగతంగా అటెస్టెడ్ చేసిన రిజిస్ట్రర్డ్ డాక్యుమెంట్ (ఓనర్‌షిప్ టైటిల్), రిజిస్ట్రేషన్ శాఖ జారీచేసిన ఈసీ, మార్కెట్ వాల్యూ డాక్యుమెంట్ జతపర్చాలి.
- పురపాలక శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా 120 రోజుల్లో వివరాలను పూర్తి చేసి, నిర్ధేశిత అపరాధ రుసుం చెల్లించాలి.
- ఆ భవనానికి లైసెన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజనీర్‌తో సేఫ్టీ మెజర్‌మెంట్ పాటిస్తున్నట్లు ధృవీకరణ ఇవ్వాలి.
- బీపీఎస్‌లో పారదర్శకత కోసం భవనం యజమాని క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్‌ల రూపంలోనే విధించిన రుసుమును చెల్లించవచ్చు.

బీపీఎస్ నిధులు స్థానిక సంస్థలకే...

బీపీఎస్ కింద జమ అయ్యే మొత్తాలను ఆయా స్థానిక సంస్థలకే ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అన్న క్యాంటీన్లు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, లెగసీ వ్యర్థాలు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, రోడ్లు,ఇతర ప్రాధాన్యత పనులు వాడుకోవాలని సూచించారు. న్యూ మాస్టర్ ప్లాన్ రోడ్లు, లింకు రోడ్డు, చెరువులు, సరస్సులు, రిక్రియేషన్ క్లబ్‌లు, ఓపెన్ లే-అవుట్ల పరిరరక్షణకు వాడుకోవాలని ఆదేశాల్లో పురపాలక శాఖ పేర్కొంది.

కొల్లేరుపై నేడు కలెక్టర్లతో సమీక్ష

ఏలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు అంశంపై ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(పీసీసీఎఫ్), హెడ్ ఆఫ్ ఫారెస్టు ఫోర్సు(హెచ్‌ఓఎఫ్ఎఫ్) డాక్టర్ పీవీ చలపతిరావు ఆధ్వర్యంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు కె.వెట్రిసెల్వి, చదలవాడ నాగరాణిలతో సమావేశం కానున్నారు. ప్రధానంగా కొద్ది నెలల క్రితం జిల్లాలో పర్యటించిన సుప్రీం నియమించిన కొల్లేరు సాధికారిత కమిటీ (సీఈసీ)కి కొల్లేరు సరస్సు, అభయారణ్యం భూముల విషయంలో జిల్లా అధికారులు తీసుకున్న చర్యలు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలి. ఇప్పటికే కొల్లేరులో భూముల వ్యవహారంలో సరిహద్దుల ఏర్పాట్లు పూర్తి చేయడంతో, వీటికి సంబంధించి మ్యాప్‌లు, ఇతర అంశాలపై చలపతిరావు చర్చించనున్నారు. ఇరు జిల్లాల అటవీ శాఖాధికారులు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొంటారు.

గాడిన పడాలి

సమయపాలన పాటించని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది

ఆంధ్రజ్యోతి విజిట్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పాలనా పరంగా ఇంకా గాడిన పడాలి. జవాబుదారీతనం పెరగాలి. జనాభా ప్రాతిపదికన సిబ్బందిని సర్దుబాటు చేసినప్పటికి పలుచోట్ల సేవల పరంగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొన్నిచోట్ల తగిన సిబ్బంది లేకపోవడం.. కొందరు హాజరు వేసి.. కార్యాలయాల నుంచి వెళ్లిపోవడం వంటి విషయాలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఆంధ్రజ్యోతి విజిట్‌లో బయటపడ్డాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్కు)

హాజరు మాయాజాలం!

పలుచోట్ల కొందరు సిబ్బంది గైర్హాజరు

ఉద్యోగులు లేక వెనుదిరుగుతున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి విజిట్‌లో వెలుగులోకి..



పెదపాడు మండలంలో రెండు, మూడు శాఖల మినహా మిగిలిన సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. చాలా మంది నిర్ణీత సమయానికంటే గంట ఆలస్యంగా వస్తున్నారు. సచివాలయాలను, సిబ్బందిని పర్యవేక్షించాల్సిన కార్యదర్శులే సమయానికి రావడం లేదు. సోమవారం ఉదయం10.30 గంటల సమయానికి పెదపాడు సచివాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.



వేగవరం సచివాలయంలో ఇలా..

గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ పరంగా 594 సర్వీసులను అందించాలి. కాని, కేవలం 20 వరకు సేవలు అందుతున్నాయి. ఏలూరు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 495, పట్టణాలు, కార్పొరేషన్ పరిధిలో 110 కలిపి మొత్తం 605 సచివాలయాలు వున్నాయి. కూటమి ప్రభుత్వం జాబ్‌చార్టు అమలు చేయడంతో కొంత వరకు సర్దుబాటు జరుగుతోంది. పట్టణాల్లో రీ గ్రూపింగ్ జరగ్గా, గ్రామాల్లో సిబ్బందిని చాలా చోట్ల సర్దుబాటు చేస్తున్నారు.

హాజరు అంతంతే..

సచివాలయ వ్యవస్థ ద్వారా సత్వరం సమస్యలు పరిష్కారమవుతాయని ఇంటి పనులు పక్కన పెట్టి కార్యాలయాలకు వచ్చే వారికి సిబ్బంది చుక్కలు చూపిస్తున్నారు. సమయ పాలన పాటించకపోవడంతో కార్యాలయాల వద్ద ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. మధ్యాహ్నం దాటితే సిబ్బంది పలుచోట్ల ఉండ టం లేదు. ద్వారకా తిరుమల-2 (కొమ్ముగూడెం)లో మహిళా పోలీస్‌కు ఇటీవల డీఎస్‌సీ ఉద్యోగం రావడంతో రిజైన్ చేయగా ఆ రెండుచోట్ల ద్వారకా తిరుమల మహిళా పోలీస్ కమలకుమారి నే విధులు నిర్వర్తిస్తున్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్ మండలం వేగవరం సచివాలయం-2లో మొత్తం తొమ్మిది మంది సిబ్బందికి సోమవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ముగ్గురు హాజరయ్యారు. అదే సమయంలో సచివాలయానికి వస్తే మరో సచివాలయానికి వెళ్లండని చెబుతున్నారు. లేదంటే రేపు రమ్మని అనడంతో తిరిగి వెళ్లక తప్పలేదు. సచివాలయం-1కి వెళ్లగా వెల్ఫేర్ అసిస్టెంట్, వీఆర్వో, పశుసంవర్ధక సహాయకులు మాత్రమే సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయం దాటే వరకు సచివాలయం కుర్చీల్లో ఉన్నారు. మిగిలిన కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. దీనిపై అక్కడున్న సిబ్బందిని అడగ్గా సచివాలయం-1 సెక్రటరీ సెలవులో ఉండటం వలన ఇక్కడ సెక్రటరీ అక్కడ విధులు నిర్వహిస్తున్నారని, మిగిలిన వారిలో ఇద్దరు సెలవు పెట్టారని జవాబు చెప్పారు.

రెండు చోట్ల అగ్రికల్చర్ అసిస్టెం టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కామవరపుకోట సచివాలయంలో 32 మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ సోమవారం ఉదయం 10 గంటలకు 18 మంది, మధ్యాహ్నం 12 గంటలకు 28 మంది ఉద్యోగులు హాజరుకాగా మిగిలిన వారు డిప్యుటేషన్ల

(మిగతా 8వ పేజీలో)



కొందరికే.. పనిభారం

ఏఎన్ఎం, వెల్ఫేర్ సెక్రటరీ, ప్లానింగ్ సిబ్బంది, వీఆర్వోలే ఎక్కువ పనిభారం మోస్తున్నారు. ఇతర విభాగాల సిబ్బందిలో కొందరు షరా మామూలుగా విధులు నిర్వహిస్తున్నారు. మహిళా పోలీస్ సిబ్బంది పని యాంత్రికమైంది. వీరు విధు ల్లో వున్నా పెద్దగా పనిలేదు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వేయర్లను మండలాల్లో తీసుకెళ్లి వినియోగించడంతో సర్వే సమస్యలు గ్రామాల్లో తగ్గడం లేదు.



హాజరైంది ఒక్కరే..!

వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము 1, 2 సచివాలయాల్లో సోమవారం ఉదయం 11.30 గంటలకు ఒక్క వెటర్నరీ అసిస్టెంట్ మినహా మిగిలిన సిబ్బంది గైర్హాజరయ్యారు. హాజరు పట్టీలో మాత్రం అందరూ వచ్చినట్లు సంతకాలు చేశారు. సచివాలయ కార్యదర్శితోపాటు వెల్ఫేర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, డిజిటల్ ఇంజనీరింగ్, మహిళా పోలీస్, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బందితోపాటు గ్రామ సర్వేయర్ గైర్హాజరయ్యారు. పలు సమస్యలపై సచివాలయానికి వచ్చిన వారంతా సిబ్బంది లేకపోవడంతో వెళ్లిపోయారు. హాజరైన ఒకే ఒక్క వెటర్నరి అసిస్టెంట్‌ను సిబ్బంది వివరాలు అడగగా బయల్దేరి వస్తున్నారని చెప్పారు. ఇలా పలు విభాగాల సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకాకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు.

తవ్వేస్తాం.. ఆక్రమిస్తాం

నూజివీడులో మట్టి మాఫియా దందా

- మీడియా రాకతో ఎక్కడి మట్టి అక్కడే.. పొంతన లేని సమాధానాలు చెప్పి పరార్
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు..
- మీడియా దృష్టికి తెచ్చిన హనుమంతులగూడెం ప్రజలు



హనుమంతులగూడెంలో మీడియా రాకతో పరార్ అవుతున్న టిప్పర్లు

నూజివీడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిన్నటి వరకు ఎలాంటి అనుమతులు లేకున్నా చాటుమాటుగా అక్రమ మట్టి తోలకాలు సాగిస్తున్న నూజివీడులోని మట్టి మాఫియా మంగళవారం రాత్రి నుంచి అడ్డొస్తే తొక్కించేస్తామంటూ బెదిరింపులకు దిగింది. ఇలాంటి సంస్కృతి నూజివీడులో ఇంత వరకు లేదు. నూజివీడు మండలం హనుమంతులగూడెంలో మంగళవారం రాత్రి మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. గ్రామ శివారులోని బి ఫామ్ అటవీ భూమి వున్న ప్రాంతం నుంచి మట్టితో టిప్పర్లు గ్రామం మధ్య నుంచి వస్తుండగా గ్రామస్తులు ఆ టిప్పర్లు రాష్ట్ర రహదారిపైకి రాకుండా అడ్డుకున్నారు. గ్రామస్తులు అక్రమ మట్టి రవాణా చేస్తున్న వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెచ్చిపోయిన మట్టి మాఫియా అడ్డు తప్పుకోకపోతే తొక్కించేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో అధికారులు

(మిగతా 8వ పేజీలో)

వారు ఎక్కడైనా మట్టి కనిపిస్తే విచ్చల విడిగా తవ్వేస్తారు.. టిప్పర్ లారీల్లో తరలిస్తారు. అడిగితే బెదిరిస్తారు. కూటమి నాయకుల అండదండలతో నూజివీడు నియోజకవర్గంలో చెలరేగిపోతున్నారు. వీరు.. కలిదిండిలో ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన మార్జిన్‌లను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీటిపై ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

కలిదిండిలో రోడ్లపైనే దుకాణాలు

- మద్వానిగూడెం నుంచి కలిదిండి వరకు.. కుచించుకుపోతున్న రాష్ట్ర రహదారి
- వాహనాలన్నీ రోడ్లపైనే
- తరచూ ప్రమాదాలు.. ట్రాఫిక్ జామ్‌లు.. పట్టించుకోని అధికారులు



గుర్వాయిపాలెంలో రాష్ట్ర రహదారి వెంబడి అక్రమ వెల్డింగ్ షాపులు

కలిదిండి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. మద్వానిగూడెం-ఏలూరు వంతెన వద్ద నుంచి కలిదిండి జడ్పీ హైస్కూల్ వరకు ఏడు కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారి ఇరువైపులా యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. మద్వానిగూడెం నుంచి గుర్వాయిపాలెం సెంటర్ వరకు రాష్ట్ర రహదారికి ఇరువైపులా మార్జిన్‌లలో అక్రమంగా వెల్డింగ్ వర్క్‌షాపులు వెలిశాయి. కలిదిండి మార్కెట్ యార్డు నుంచి జడ్పీ హైస్కూల్ వరకు రహదారి వెంబడి అక్రమంగా దుకాణాలు, లారీ ఆఫీసులు, కొం దరు సిమెంట్ గోడలతో రేకుల షెడ్లు నిర్మించారు.


ప్రమాదాలు.. ట్రాఫిక్ జామ్‌లు

రాష్ట్ర రహదారి వెంబడి ఏటా ఆక్రమణలు పెరుగుతున్నప్పటికి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం భీమవరం, విజయవాడ, హైదరాబాద్

(మిగతా 8వ పేజీలో)

అబార్షన్లు, లింగ నిర్ధారణ స్కానింగ్ చేస్తే జైలుకే

ఏలూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అబార్షన్లు, లింగ నిర్ధారణ స్కానింగ్ పరీ క్షలు చేసే వైద్యులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం హెచ్చరించారు. బుధవారం డీఎం హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన పీజీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు-1994 సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా వుంచి, అటువంటి స్కానింగ్ సెంటర్లపై విచారణ చేస్తాం. నేరం రుజువైతే ఆ స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసి, నిర్వాహకులకు జరిమానాతో కూడిన జైలు శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. కొత్తగా రిజిస్ట్రేషన్‌కోసం దరఖాస్తు చేసుకున్న 4 స్కానింగ్ సెంటర్లు, ఇప్పటికే నిర్వహిస్తోన్న స్కానింగ్ సెంటర్లలో చిరునామా, ఉద్యోగులు, తదితరఅంశాల్లో మార్పులకోసం అందిన 7 దరఖాస్తులను సలహా కమిటీ సభ్యులు పరిశీలించి ప్రీఅప్రూవల్ ఇచ్చారు. వీటిపై కలెక్టర్ తుది ఆమోదముద్ర పడాల్సి ఉంటుంది. స్కానింగ్ సెంటర్ల కార్యకలాపాలపై డెకాయ్ ఆపరేషన్లు వేగవంతం చేయాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ, డీపీహెచ్‌ఎన్‌వో డాక్టర్ జ్యోతి, డెమో శ్రీనివాసరావు, డాక్టర్ పూజ, గైనకాలజిస్టు డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.



శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

7

- అరుణాచలం రైలు జనవరి వరకు పొడగింపు
- 15న నరసాపురం - సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు

క్రీడా సమాచారం

ముగిసిన సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు


యోగాకు ఎంపికైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు

ఏలూరు రూరల్/తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ఏలూరు జిల్లా ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బుధవారం ఉత్సాహంగా ముగిశాయి. జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎస్ఏ అజీజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక కార్యక్రమాన్ని క్రీడాభివృద్ధి శాఖ కోచ్‌లు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పర్యవేక్షించారు. రెండో రోజు క్రికెట్, యోగా, డ్యాన్స్ విభాగాలలో ఉద్యోగులు 20 మంది పాల్గొనగా 15 మందిని ఎంపిక చేసినట్లు అజీజ్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డీఎన్ఆర్ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. మోహన్‌దాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, ఆరవల్లి ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయిని చల్లా హేమలత, చెరుకువాడ జడ్పీ పాఠశాల హిందీ టీచర్ సీహెచ్ రమాదేవి ఎంపికయ్యారు. ఎంపికైన వారు ఈనెల 19 నుంచి 22 వరకు ఎన్టీఆర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో పాల్గొంటారు.

ఏలూరు జిల్లాలో ఎంపికైన ఉద్యోగులు ..

క్రికెట్ : పవన్ శ్రీనివాస్‌రెడ్డి, బి.నవీన్‌సూర్య, కె.రాజేష్, ఎం.కృష్ణారావు, ఎ.సునీల్‌బాబు, ఎం.డి.మొహిషీన్, వీఎస్‌డీవీ ప్రసాద్, జె.సత్యనారాయణ, డి.రవికుమార్, జి.సతీష్‌కుమార్, షేక్ రియాజ్, డి.వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు.

యోగా : మొనగంటి మహీంద్రాచార్యులు, ఇరప అమ్మాజీ.

డ్యాన్స్ : పాయం రత్నకుమారి ఎంపికయ్యారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు 'స్వామినాయుడు'


స్వామి నాయుడును అభినందిస్తున్న సిబ్బంది

ఏలూరు రూరల్, నవంబరు 12, (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థి బలగా స్వామినాయుడు జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యాడని తంగెళ్లమూడి శ్రీసూర్య పాఠశాల డైరెక్టర్ కె.చంద్రశేఖరరావు తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఈత పోటీల్లో స్వామినాయుడు రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించడం ద్వారా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడన్నారు. ఈత పోటీల్లో స్వామినాయుడు ఇప్పటికే అనేక పతకాలు సాధించాడు. ఈత పోటీలకు ఎంపిక కావడం పట్ల బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ఉత్సాహంగా సాగుతున్న టెన్నిస్ పోటీలు


డబుల్స్‌లో టెన్నిస్ క్వార్టర్ ఫైనల్స్ ఆడుతున్న క్రీడాకారులు

పాలకొల్లు టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న సీహెచ్ బుద్ధావతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ పోటీలు బుధవారం నరసాపురంలోని రెండు కోర్టుల్లోనూ, పాలకొల్లు కాస్మోలోని కోర్టులోనూ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో నిర్వహించినట్లు కన్వీనర్ గొట్టుముక్కల భూన్‌రాజు తెలిపారు. గురువారం సెమి మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం 45, 55, 65, 70 విభాగాల్లో ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమం ఈనెల 14వ తేదీన జరుగుతుందన్నారు.

విజేతల వివరాలు : డబుల్స్ 70ప్లస్ విభాగంలో ఎ.రాంబాబు, ఎస్.సేతులు-ఎన్‌సీ అశోక్‌రెడ్డి, కె.సీతారామరాజులపై విజయం సాధించారు. రాధాకృష్ణమూర్తి, జీవీ సన్యాసినాయుడు- డీఎస్ఎన్ రాజు, వి.సుందీర్‌లపై గెలుపొందారు.

- 65ప్లస్ పోటీల్లో..(సింగిల్స్) వి.శ్రీనివాసరెడ్డి ఎస్ఎస్ రాథ్‌పై విజయం సాధించారు. ఎం.ఉదయ్‌భాస్కరరాజు వి.ధనుంజయులుపై గెలుపొందారు.
- 65డబుల్స్ విభాగంలో.. జి.బాలసుబ్రహ్మణ్యం, వి.పార్థసారథి-వి శ్రీనివాసరెడ్డి, ఎస్ఎస్ రాథ్‌లపై విజయం సాధించారు.
- 55సింగిల్స్ విభాగంలో..ఆర్ఎన్ రమేష్-పాల్ మనోహర్‌పై విజయం సాధించారు. రెండో పోటీలో బాబురాజు -కోటేశ్వరరావుపై గెలుపొందారు. స్నేహశశి బెహర-ఎ.వెంకటేశ్వర్లుపై విజయం సాధించారు.
- 45సింగిల్స్ విభాగంలో.. రమేష్ బాలు-శంకర్ నాయుడుపై విజయం సాధించారు. భాస్కరరావు-టి.రామారావుపై గెలుపొందారు. రెడ్డి నాగరాజు-ఎంవీఎల్ఎన్ మధుపై విజయం సాధించారు.

యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో భార్గవికి కాంస్య పతకం


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

చింతలపూడి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వి.భార్గవి యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలలో డిస్కస్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించిందని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదికవి నన్నయ వర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 10,11 తేదీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీలలో ఆమె డిస్కస్‌త్రో విభాగంలో యూనివర్సిటీ పరిధిలో కాంస్య పతకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మహ్మద్ ఆలీని ప్రిన్సిపాల్ అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ, రగ్బీ పోటీలకు టి.నరసాపురం విద్యార్థులు


గెలుపొందిన విద్యార్థులతో హెచ్ఎం బీఎల్ స్వామి

టి.నరసాపురం, నవంబరు 12, (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, రగ్బీ పోటీల్లో టి.నరసాపురం హైస్కూల్ విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు హెచ్ఎం బీఎల్ స్వామి తెలిపారు. పాఠశాల్లో విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల మూడో తేదీన కడప జిల్లా పులివెందులలో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు సీహెచ్.వినయ్, ఆర్.నాగరాణి, కె.లావణ్య ఎంపికయ్యారన్నారు. ఈనెల 4న జంగారెడ్డిగూడెంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14,17 విభాగాల్లో తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిభ కనపర్చారన్నారు. బాలికల విభాగం అండర్-14లో సిరి బిందు, అండర్-17 విభాగంలో ప్రసన్న, ఎన్.దుర్గ, బాలుర విభాగంలో అండర్-14లో బి.పవన్, డి.ప్రశాంత్, అండర్-17 విభాగంలో బి.దయాకర్, ఎన్. కౌషిక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గన్నవరం, నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈనెల 8న గోపన్నపాలెంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ ఎంపికలలో విద్యార్థులు అండర్-14 విభాగంలో కె.సాయిదీపక్, అండర్-17 విభాగంలో కె.సందీప్ ఎంపిక కావడంతో మచిలీపట్నం, కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అడపా రామకృష్ణను స్కూల్ సిబ్బంది ఎస్ఎంసీ ఛైర్మన్, గ్రామస్థులు అభినందించారు.

మాలధారణం నియమాల తోరణం

గజ గజ వణికే చలిలో వేకువ జామునే చన్నీటి స్నానం. రాళ్లు, ముళ్లు గుచ్చుకున్నా కాళ్లకు చెప్పులు లేకుండానే నడక. పట్టు పరుపులు ఉండవు. పట్టె మంచాలు ఉండవు. అంతా కఠిక నేలపైనే నిద్ర. చెడు అలవాట్లకు దూరం. క్రమశిక్షణ. ఇవి మాలధారుల నిబంధనలు.. సహజంగా ఏ స్వామి మాలధారణ చేసినా ఈవిధమైన నిబంధనలే ఉంటాయి. 41 రోజులు, 21 రోజులు, 11 రోజులు ఇలా దీక్షలు చేపడుతుంటారు. ఏ దీక్ష చేపట్టినా ఆ భగవంతుడి కరుణా కటాక్షాల కోసమే..


జంగారెడ్డిగూడెంలో మాలధారణ

స్వామియే శరణం అయ్యప్ప



జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులు 41 రోజుల పాటు కఠిన దీక్ష చేస్తారు. స్వామి అనుగ్రహానికి శబరిమలై బాట పడతారు. దీనినే మండల దీక్ష అంటారు. అయ్యప్ప స్వామి దీక్ష అందరికీ మోక్షదాయకం. 41, 108 రోజుల పాటు నియమ నిబంధనలు పాటిస్తూ భక్తి భావంతో అయ్యప్ప స్వామిని నిత్యం స్మరించు కుంటూ కఠిన దీక్ష చేసి అయ్యప్ప దర్శనార్థం వనయాత్ర చేపడుతుంటారు. కేరళలో ఉన్న శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ ప్రవేశాలకు ప్రతి సంవత్సరం నవంబరు 16 నుంచి భక్తులను అనుమతిస్తారు. అప్పటి నుంచి అయ్యప్ప స్వామి నిత్యదర్శనాలు జరుగుతుంటాయి. గ్రామ గ్రామాన ఆలయాలు, ప్రత్యేక పందిళ్లలో పీఠాలను ఏర్పాటు చేసుకుని అయ్యప్ప దీక్షధారులు సామూహికంగా దీక్షను చేస్తారు. దీక్షలో భాగంగా రోజులో ఒకసారి మాత్రమే భిక్ష (భోజనం), ఉదయం, సాయంత్రం అల్పాహారాలను స్వీకరిస్తారు. ఉదయం, సాయంత్రం పూజలకు ముందు చన్నీటి స్నానాలు చేస్తారు. ఏటా కార్తీకమాసం ఆరంభానికి ముందే అయ్యప్ప దీక్షలను చేపడతారు.

18 మెట్లు

1. భూమి, 2. నీరు, 3.అగ్ని, 4. గాలి, 5. ఆకాశం, 6. చూపు, 7. వినికిడి, 8.వాసన, 9. రుచి, 10.స్పర్శ 11.మనస్సు, 12. బుద్ధి, 13.చిత్తం, 14.అహంకారం, 15. ధర్మం, 16. అర్థం17. కామం, 18వ మెట్టు మోక్షం. 18 మెట్లకు 18 రకాల శక్తులుండడం వల్ల 18 సార్లు యాత్ర చేసి వస్తే తమ జన్మ సార్థకమని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

దీక్షలు

మండల దీక్ష అంటే 41 రోజుల కాలం. కొందరు స్వాములు 108 రోజుల దీక్ష కూడా ఆచరిస్తారు. మొదటి సారి మాల స్వీకరించిన స్వామిని కన్నె స్వామి అని పిలుస్తారు. అయ్యప్పస్వామికి కన్నె స్వామి అంటే ఎంతో ప్రీతి. అందుకే ప్రతి పూజా కార్యక్రమంలో కన్నెస్వామికి ప్రాధాన్యం కల్పిస్తారు. ఆ స్వామితో కలిసి పెడతుళ్ల ఆడతారు. రెండో ఏడాది మాల ధరిస్తే కత్తిస్వామి, మూడో ఏడాది గంటస్వామి, నాల్గవ ఏడాది గద స్వామి, ఐదో ఏడాది పేరుస్వామి, ఆరో ఏడాది గురుస్వామిగా పిలుస్తారు.

21 సార్లు మాలధారణ



అయ్యప్ప దీక్ష చేపట్టే అవకాశం రావడం నా అదృష్టం. ఇప్పటి వరకు 21 సార్లు మాలధారణ చేసి శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించుకున్నాను. చాలా మంది స్వామి వారి దీక్ష చేపట్టి సేవ చేద్దామనుకున్నా వారికి ఆరోగ్యం సహకరించదు. ప్రతి ఏటా దీక్షను చేపట్టి స్వామిని దర్శించుకోవడం నా పూర్వజన్మ సుకృతం.

గరికపాటి రవీంద్ర, గురుస్వామి

వైకుంఠనాదుని సన్నిధి దీక్షాధారులకు పెన్నిధి

- గోవింద, శివ నామాలతో శోభిల్లుతున్న శ్రీవారి క్షేత్రం
- చినవెంకన్న సేవలో దీక్షాధారులు


ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో గోవింద మాలధారులు

ద్వారకాతిరుమల, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ద్వారకాతిరుమలలో ప్రతిరోజూ ఈ దీక్షాధారులతో శోభిల్లుతోంది. క్షేత్రంలో పలువురు ఇప్పటికే గోవింద, శివదీక్షల్లో నిమగ్నం కాగా వివిధ ప్రాంతాల నుంచి భవానీ, అయ్యప్ప, ఆంజనేయ మాలాధారుల రాకతో ద్వారకాతిరుమల కళకళలాడుతోంది. క్షేత్ర సమీప గ్రామాల భక్తులతో పాటు ఏలూరు, తూర్పు, పశ్చిమ, కృష్ణా వంటి పలు జిల్లాలకు చెందిన వారు ఈ ఏడాది గోవింద, శివ, ఆంజనేయ, భవానీ, అయ్యప్ప దీక్షలను చేపట్టారు. ఈక్రమంలో గోవింద స్వాములు డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి నాడు దీక్షను విరమించనున్నారు. అంతకు ముందురోజున మధ్యాహ్నం గిరిప్రదక్షిణలో పాల్గొననున్నారు. ఆతరువాత స్వామి వారి నిజరూపదర్శనాన్ని చేసుకుని దీక్షావిరమణ చేస్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీరుచేసే భజనలతో క్షేత్రం మారు మ్రోగుతున్నది.

దీక్షలు-రకాలు

108 రోజులైతే మహామండల దీక్ష, 41రోజులు మండల దీక్ష, 21రోజులు అర్థ మండల దీక్షలు సాధారణంగా స్వాములు ధరిస్తారు. కొందరు ఈనెల 15న ఏడువారాల గోవిందదీక్షను, ఈనెల 17న 41 రోజుల దీక్షను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కొన్ని అనివార్య పరిస్థితులలో అనుకున్న సమయానికి మాల ధరించలేని భక్తులు 11 లేదా 9 రోజుల దీక్షను సైతం చేపడుతుంటారు.

దేవస్థానం అందిస్తున్న వసతులు

గోవింద దీక్షాధారులకు ప్రతి నిత్యం ఉదయం, సాయంత్రం వేళ స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని కల్పిస్తోంది. మధ్యాహ్న సమయంలో స్వాములకు శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని అందజేస్తున్నారు. గిరి ప్రదక్షిణలో స్వాములకు అన్నిసౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

18 సార్లు దీక్షచేపట్టా..



ఎవరైతే దీక్షాధారణ చేయదలిచారో శ్రీవారికి ముడుపు కట్టి దీక్షను ప్రారంభించాలి. కొందరు ఏడు వారాల దీక్ష చేపడతారు. కొందరు 41 రోజులు స్వీకరిస్తారు. భక్తిప్రపత్తులతో చేస్తే ఆయనే మనకు దారి చూపుతాడు. 18మార్లు ఆ గోవిందుని దీక్షలో తరించాను.

- మిడతా ఆంజనేయులు గురుస్వామి, గుండుగొలనుకుంట

15 ఏళ్లుగా శివమాల



శివుడు బోళాశంకరుడు. ఆయన సేవలను తరిస్తే అంతా మంచి జరుగుతుంది. పదిహేనేళ్లుగా శివమాల ధరిస్తున్నాను. ఇప్పటికే నేను ద్వాదశ జోతిర్లింగాలైన కేదారేశ్వర్, శ్రీశైలం, మహాకాళేశ్వరం, సోమేశ్వర, ఓంకారేశ్వరం, వైద్యనాథ్, భీమేశ్వరం, రామేశ్వరం, నాగేశ్వర్, వారణాసి, త్రయంబకేశ్వరం క్షేత్రాలను సందర్శించాను.

- టి. ప్రకాష్ గురుస్వామి, ద్వారకాతిరుమల

హనుమద్ దీక్షలు


మద్ది ఆలయంలో హనుమద్ దీక్షలు చేపడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న భక్తులు హనుమద్ దీక్షలు చేపడుతున్నారు. ప్రతి ఏడాది కార్తీక మాసంలో హనుమద్ దీక్షలు చేపడతారు. ఈఏడాది అక్టోబరు 23 నుంచి 25వ తేదీ మూడు రోజుల వ్యవధిలో 41 రోజుల మండల దీక్షలను సుమారు ఆరు వేల మంది మద్దికి వచ్చి దీక్షను చేపట్టారు. అర్థ మండల దీక్షలు చేపట్టే వారు ఈనెల 12 నుంచి 14వ తేదీలోపు చేపట్టాల్సి ఉంది. వీరంతా తమ దీక్షను పూర్తిచేసుకుని డిసెంబరు 4వ తేదీన మద్ది దేవస్థాన ప్రాంగణంలో జరిగే మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ఇరుముడి సమర్పణతో తమ దీక్షను విరమిస్తారు.

మహిమాన్వితం మావుళ్లమ్మ దీక్ష

- వెయ్యికి చేరిన మాలధారుల సంఖ్య



భీమవవరం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ మావుళ్లమ్మ దీక్షాధారణకు భక్తుల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రతి ఇంటి ఆడపడుచుగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రపంచ వ్యాప్తంగా పూజలు అందుకుంటున్న మావుళ్లమ్మ దీక్షాధరాణ కార్యక్రమం 15ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది మంది మాలధారణతో ప్రారభమై అప్రహితంగా ఆ సంఖ్య ఈ ఏడాదికి సుమారు వెయ్యిమందికి చేరువు అయిందంటే అమ్మవారి మహత్తు తెలుస్తోంది. ప్రతి ఏడాది ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమిరోజున అమ్మవారి దీక్షలను ప్రారంభించి 40 రోజులు పాటు దీక్ష చేసిన 41వ రోజున దీక్షను విరమిస్తారు.

దీక్ష ఆరంభకుడు రామలింగేశ్వర శర్మ

మావుళ్లమ్మ ఆలయంలో మండల దీక్ష చేపట్టాలని సంకల్పించిన నేపథ్యం అప్పటి ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల రామలింగేశ్వర శర్మ ఎంతో మంది పండితులతో చర్చించి దీక్షకు నియమనిబంధనలు, పూజా విధానం, దీక్షల విరమణ, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలను రూపొందించారు. 2011 అక్టోబరు నెలలో మావుళ్లమ్మకు దీక్షాధారణ చేసి ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల రామలింగేశ్వర శర్మ మొట్టమెదటి సారిగా దీక్ష స్వీకరించారు. ఆ సంవత్సరం 9 మందితో శ్రీకారం చుట్టారు.

ఆలయంలోనే దీక్ష ధారణ, దీక్ష విరమణ

మావుళ్లమ్మ మండల దీక్ష చేపట్టాలంటే దీక్ష తీసుకుకోవడంఆలయంలోనే ఆలయ ప్రధానర్చకుడు చేతుల మీదుగా జరుగుతుంది. మండల, అర్థ మండలం, పాద మండలం విధానంలో దీక్షలను అందిస్తారు. దీక్ష ఇచ్చేందుకు ఎక్కడా గురువులు ఉండకపోవడం విశేషం. అమ్మవారికి ఇచ్చే ఇరుముడి, దీక్ష విరమణ, అంతా అమ్మవారి ఆలయం వద్దనే ఉంటుంది.

కుంకుమ రంగు దుస్తులు

అమ్మవారికి ఎంతో ఇష్టమైన కుంకుమ రంగు దుస్తులను దీక్షకు ఉపయోగించే వస్త్రధారణకు ఎంపిక చేశారు. నెల రోజులపాటు ఈ దుస్తులతోనే అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకుంటారు. మహిళలు కుంకుమ రంగు చీర, జాకెట్టు ,దరించాల్సి ఉంటుంది.

ఒంటిపూట భోజనం

అమ్మవారి మండల దీక్షలో నియమాలు.. ఒంటిపూట భోజనం, నేలపై నిద్ర, కాలికి పాద రక్షలు ధరించ కూడదు, వెల్లుల్లి, ఉల్లిపాయ, మసాలాల నిషేధం. మద్యంపానం, ధూమపానం నిషేధం.

ఇరుముడిలో ఉండే వస్తువులు ఇవే

అమ్మవారికి 40 రోజుల దీక్ష పూర్తయిన తరువాత 41వ రోజున దీక్ష విరమణ సందర్భంగా అమ్మవారికి ఇచ్చే ఇరుముడిలో అమ్మవారికి సంబంధించిన ఎరుపు రంగు జాకెట్టు ముక్క, గాజులు, పసుపు, కుంకుమ, కాటుక, సెంటు, పన్నీరు, గంధం, బియ్యం, వంటి 11 రకాల వస్తువులను ఉంచుతారు. అమ్మవారికి అభిషేకం చేసేందుకు ఆవునేతితో కొబ్బరి కాయ ఒకటిని ఉంచుతారు. ఇరుముడిని కట్టిన తరువాత గ్రామ ప్రదక్షిణ చేసి అమ్మవారికి ఇరుముడిని సమర్పిస్తారు.

ఎంతో మహిమాన్వితం మండల దీక్ష



అమ్మవారి మండల దీక్ష ఎంతో మహిమాన్వితం, ఎంతో మంది భక్తులు అమ్మవారి దీక్షను స్వీకరిస్తున్నారు. మా తండ్రిగారు రామలింగేశ్వర శర్మ ప్రారంభించిన ఈ దీక్షలు నేటికి నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఈనెల 16న పూర్ణాహుతి, దీక్ష విరమణ జరుగుతుంది.

- మద్దిరాల మల్లికార్జున శర్మ, అర్చకుడు

శ్రీవారి భక్తులకు శుభవార్త



గర్భాలయం ముందు అమర్చేందుకు సిద్ధమైన ర్యాంపు.. శ్రీవారి మూలవిరాట్

- ఈనెల 27నుంచి అంతరాలయ దర్శనం
- టిక్కెట్టు రుసుము ఒక్కో భక్తుడి నుంచి రూ.500

ద్వారకాతిరుమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గర్భాలయంలో కొలువు దీరిన శ్రీవారి ద్విమూర్తుల దివ్య మంగళరూపాన్ని దగ్గరుండి చూడాలన్న భక్తుల ఏళ్లనాటికల సాకారం కానుంది. అర్ధదశాబ్ద కాలంగా నిలిచిన శ్రీవారి అంతరాలయ దర్శనభాగ్యం భక్తులకు త్వరలో లభించనుంది. ఈనెల 27నుంచి అంతరాలయ దర్శనాన్ని పునః ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్న రోజుల్లో స్వామివారి అంతరా లయ దర్శనాన్ని, అమ్మవార్ల ముందునుంచి భక్తులను క్యూలైన్లలో పంపే ఏర్పాటును అందరి శ్రేయస్సు దృష్ట్యా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. భక్తుల రద్దీ గతంకంటే పెరగడం, ఆలయ అంతరాలయ భాగం ఇరుకుగా ఉండడంతో అంతరాయ దర్శనాన్ని పునరుద్ధరించ లేదు. ఇటీవల కాలంలో భక్తుల కోరిక మేరకు అధికారులు పునరా లోచలో చేసి అంతరాలయ దర్శనం ఏర్పాట్ల కోసం గతంలో ఉంచిన చెక్కతో తయారైన ర్యాంపులను తెచ్చి అమర్చారు. అవి వాడకం లేక పాడైపోయిన కారణంగా మరమ్మతులు చేపట్టారు. ఈమేరకు కొన్నాళ్ల బ్రేక్ పడింది. ఇప్పుడవన్నీ సిద్ధమై ఉండడంతో అంతరాలయ దర్శనం చేసుకునే అవకాశం ఉంది. ఈమేరకు ఒక్కో భక్తుని నుంచి రూ.500 టికెట్టును రుసుముగా నిర్ణయించారు.

'మద్ది'లో లక్ష తమలపాకుల అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 12: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మాస మహోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం స్వామికి లక్ష తమలపాకులతో లక్షార్చనను అర్చకులు, పండితులు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఒక్కరోజే దేవస్థానానికి పలు సేవల రూపంలో రూ.1,99,154 ఆదాయం సమకూరగా, 1,651 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు ఈవో చందన తెలిపారు.


క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్షపత్రి పూజలు చేస్తున్న పండితులు

క్షీరా రామలింగేశ్వర స్వామికి లక్షపత్రి పూజ

- సుమారు 12 వేల మంది భక్తులు దర్శనం

పాలకొల్లు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామికి కార్తీకమాసం బుధవారం సందర్భంగా అభిషేక పండితులు మద్దూరి సూరిబాబు పర్యవేక్షణలో స్వామికి లక్షపత్రి పూజలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పంచారామ క్షేత్రాల పేరుతో వచ్చే యాత్రికులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మూడువేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సుమారు 12 వేల మంది వరకు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పాలక మండలి ఛైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

- **స్వామివారి ఆదాయం :** స్వామివారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.40.017, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.10.500, వెరసి రూ.50.517 ఆదాయం సమకూరినట్టు ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు.


మద్దిలో ఆంజనేయస్వామికి లక్షార్చన నిర్వహిస్తున్న పండితులు

బాలల దినోత్సవం నాడు పరీక్షలా?!

- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్న డీఈవో వెంకటలక్ష్మమ్మ
- రేపు జరగాల్సిన ఎస్ఏ-1 పరీక్షలు వాయిదా వేయాలని ఎస్టీఏ డిమాండ్


డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్టీఏ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి):బాలల దినోత్సవాన్ని పిల్లలకు దూరం చేసేలా ఈనెల 14న సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలను నిర్వహించడానికి విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 10న ప్రారంభమైన సమ్మేటివ్ పరీక్షలు ఏకబికిన 19వ తేదీ వరకు రెండుపూటలా జరిగేలా ఇప్పటికే టైంటేబుల్ అమలవుతోంది. ఈ వ్యవధిలోనే బాలల దినోత్సవం వచ్చింది. సాధారణంగా చిల్డ్రన్స్ డే వేడుకలను అధికారికంగా ప్రభుత్వమే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ మేరకు ఈఏడాది బాలల దినోత్సవానికి మరొక్క రోజు మాత్రమే గడువు ఉండగా, ఆ రోజున పిల్లలకు నిర్వహించాల్సిన వినోద కార్యక్రమాలు, పోటీలపై విద్యాశాఖనుంచి బుధవారం రాత్రివరకు ఎటువంటి షెడ్యూలు విడుదలకాలేదు. ఇదే విషయాన్ని డీఈవో వెంకటలక్ష్మమ్మ కూడా ధ్రువీకరించారు. టైంటేబుల్ ప్రకారమే సమ్మేటివ్ పరీక్షలు జరుగుతాయని స్పష్టతనిచ్చారు. బాలల దినోత్సవం కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న బాలల దినోత్సవాన్ని నిర్వహించాలా, వద్దా అనే దానిపై డైలమా నెలకొంది. వాస్తవానికి ఆ రోజున అన్ని పాఠశాలల్లో బాలబాలికలంతా ఉత్సాహంగా గడిపేందుకు వీలుగా టీచర్లు, హెచ్ఎంలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీనికిభిన్నంగా ప్రస్తుతం సమ్మేటివ్ పరీక్షలు జరుగుతుండడం చిల్డ్రన్స్ డే కార్యక్రమాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

వాయిదాకు ఎస్టీఏ డిమాండ్

బాలల దినోత్సవం రోజున సమ్మేటివ్ పరీక్షలు జరిపేలా టైంటేబుల్‌ను నిర్ణయించడాన్ని తప్పుబడుతూ, ఆ రోజున అన్ని తరగతులకు జరగాల్సిన పరీక్షలను వాయిదావేయాలని డిమాండ్ చేస్తూ డీఈవో వెంకటలక్ష్మమ్మకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు, రాము వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఆ రోజున జరగాల్సిన అన్ని తరగతుల పరీక్షలను మరో తేదీకి వాయిదా వేయాలని కోరారు.

ఏలూరు జిల్లాలో 15 వేల గృహ ప్రవేశాలు

» ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

నూజివీడు టౌన్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజే మూడు లక్షల నిరుపేదల ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో బుధవారం ఒక్కరోజే 15,024 నూతన ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమం నిర్వహించాం' అని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా నూజివీడు గొడుగువారిగూడెంలోని లబ్ధిదారు తురకా అంకమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆమె బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలోను గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించామన్నారు. కొత్తగా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించే కార్యక్రమం సభలలో జరుగుతుందన్నారు. కొత్తగా ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంబంధిత గ్రామ సచివాలయాల్లో జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారు దంపతులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మున్సిపల్ కమిషనర్ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



ట్రెజరీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీవో నాయకులు, చోడగిరి శ్రీనివాస్

పెండింగ్ బిల్లులు కోరుతూ ట్రెజరీ డైరెక్టర్‌కు వినతి

ఏలూరు,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు త్వరితగతిన ఇప్పించాలని, నిధులు వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఈ మేరకు మంగళగిరిలోని నిధి భవన్‌లో రాష్ట్ర ట్రెజరీశాఖ డైరెక్టర్ ఎన్. మోహన్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రాష్ట్ర ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణతో పాటు జిల్లా నుంచి పలువురు నాయకులు కలిసి వెళ్లినట్లు వివరించారు. ఈ విషయంపై సానుకూలంగా డైరెక్టర్ స్పందించారని శ్రీనివాస్ తెలిపారు.

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి : ఏఐటీయూసీ



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, కార్మికుల కోసం పోరాటాలు ఉధృతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట్రామారావు, డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్ఫూర్తి భవనంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను ఎత్తివేస్తూ కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, పి.కిశోర్, చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, భజంత్రి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 50 మంది మునిసిపల్ కార్మికులు వీరి సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. వారికి డేగా ప్రభాకర్ బృందం పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

'విద్యాదాత మూర్తిరాజు చిరస్మరణీయులు'



మూర్తిరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరంటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చదువే అభివృద్ధికి మూలం అని గ్రహించి విద్యకు ప్రోత్సాహం అందించిన విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు చిరస్మరణీయులు అని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. చింతలపాటి మూర్తిరాజు 13వ వర్ధంతి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 110 ఏళ్ల క్రితమే విద్య ప్రాముఖ్యతను గుర్తించి వందలాది విద్యాసంస్థలను ఏర్పాటుచేసిన గొప్ప వ్యక్తి మూర్తిరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఇందుకూరి రామలింగరాజు, చెరుకువాడ రంగసాయి, చింతలపాటి రామకృష్ణంరాజు, బుద్దరాజు వెంకటపతిరాజు, చెరుకువాడ సుబ్రహ్మణ్యం, మంతెన రామలింగరాజు, చేకూరి ఝాన్సీ, కలిగొట్ల గోపాలశర్మ, అల్లూరి సాయిదుర్గరాజు, ఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'సాదే సాహితి సౌరభం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ రామచంద్రరాజు

పెనుగొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో తన రచనల ద్వారా జాతీయ అంతర్జాతీయ అవార్డులు సాధించిన బాలచందర్ ఎస్వీకేపీ కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారని ఎస్వీకేపీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రామచంద్రరావు అన్నారు. బుధవారం ప్రముఖ కవి రచయిత డాక్టర్ బాలచందర్ రచించిన 'సాదే సాహితి సౌరభం' పుస్తకావిష్కరణ కార్యక్రమం పెనుగొండలోని ఎస్వీకేపీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.తమ్మయ్య మాట్లాడుతూ బాలచందర్ గురువును మించిన శిష్యుడిగా ఎదిగాడన్నారు. ఈ సందర్భంగా కవి బాలచందర్ మాట్లాడుతూ 2026 జనవరి 10,11,12 తేదీల్లో నిర్వహించే స్వర్ణోత్సవాలకు తమ వంతు సహకారం అందిస్తానన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణస్వామి, జాయింట్ సెక్రటరీ సుబ్రహ్మణ్య వర్మ, రంకిరెడ్డి రామ్మోహన రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ, విశ్రాంత ప్రిన్సిపాల్ జె.సుజాత కుమారి, బీవీ నరసింహరాజు, సూపరింటెండెంట్ శివ రామరాజు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



స్వర్ణ పతకాన్ని సాధించిన అమీనాతో విద్యాసంస్థల ప్రతినిధులు

ఏలూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం పరిధిలో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎం.డి. అమీనా డిస్కస్‌త్రో పోటీలో స్వర్ణపతకాన్ని, జి.నరేంద్రసిద్ధూ 110 మీటర్ల హార్డిల్స్ పోటీలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. వీటితో పాటు ఈనెల 11న ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో జానపద నృత్యం (గ్రూప్) పోటీలో తమ కళాశాల విద్యార్థుల బృందం అద్భుతప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపికైందని వివరించారు. విజేతలను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు అభినందించారు.

అంచనా వ్యయం తగ్గింది..



» జాతీయ రహదారి ఫేజ్-1లో కలసిన 6 కిలోమీటర్లు
» రూ. 2,100 కోట్లతో డీపీఆర్ సిద్ధం
» ఆర్థిక శాఖ ఆమోదమే తరువాయి
» మంత్రి మండలికి చేరనున్న డీపీఆర్

(భీమవరం- ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరి జిల్లాకు అత్యంత ప్రధానమైన జాతీయ రహదారి-165 ఫేజ్-2 నిడివి తగ్గింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికలోను అంచనా వ్యయం తగ్గించారు. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 45 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఫేజ్-2 రహదారి నిర్మించాల్సి ఉంది. దాదాపు రూ. 2 వేల 400 కోట్లు వ్యయం కాగలదని తొలుత అంచనా వేసి నివేదిక కేంద్రానికి పంపారు. ప్రాజెక్టు నివేదికలో పలు మార్పులు చేర్పులు చెయ్యాలని కేంద్రం సూచించింది. ఆ మేరకు మరోసారి నివేదిక రూపొందించారు. అయితే పామర్రు నుంచి ఆకివీడు వరకు నిర్మించిన ఫేజ్-1లోనే మరో 6 కిలోమీటర్లు ఫేజ్-2లోని విస్తీర్ణాన్ని కలిపారు. దాంతో ఫేజ్-1 విస్తీర్ణం పెరిగింది. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు ఫేజ్-2 నిడివి 35 కిలోమీటర్లుకు తగ్గింది. అంచనా వ్యయం కూడా తగ్గించాల్సి వచ్చింది. తాజాగా రూ. 2 వేల 100 కోట్లతో కేంద్రానికి ప్రాజెక్టు నివేదికను పంపారు. దీనిపై కేంద్రం కూడా సంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థిక శాఖ వద్ద నివేదిక ఆమోదం పొందాల్సి ఉంది. అనంతరం క్యాబినెట్ ఆమోద ముద్ర వెయ్యాలి. అప్పుడే టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా మార్చి 31 నాటికి ముగియాల్సి ఉంది. లేదంటే డీపీఆర్ మళ్ళీ మొదటికి రానుంది. ప్రస్తుతం ఆకివీడు నుంచి కాళ్ళ, భీమవరం, వీరవాసరం మీదుగా పాలకొల్లు మండలంలోని దిగమర్రు వరకు వెళ్ళే ఎలివేషన్ కూడా మొదటికే వస్తుంది. కాళ్ళ, భీమవరం, మండల గ్రామాల మీదుగా జాతీయ రహదారి వెళ్ళే విధంగా ప్రణాళిక రూపొందించారు. మరో వైపు గతంలో ప్రతిపాదించిన రెండు లైన్‌ల రహదారిలో 4 లైన్‌లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి వర్మ కీలకంగా వ్యవహరించారు. కేంద్రాన్ని ఒప్పించారు. ఫలితంగా భీమవరం ప్రాంతానికి నాలుగు లైన్‌ల జాతీయ రహదారి సమకూరుతోంది.

వెయ్యి కోట్లు దాటితే ..

జాతీయ రహదారి నిర్మాణంలో ప్రాజెక్టు వ్యయం రూ. 1,000 కోట్లు దాటితే కేంద్ర మంత్రి మండలి ఆమోదం తప్పని సరి. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు రూ. 2 వేల 100 కోట్లకు చేరుకుంది. దీంతో కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తరువాత డీపీఆర్ మంత్రి మండలికి వెళ్ళనుంది. అక్కడ కూడా ఆమోదం పొందుతుందన్న ధీమా జిల్లా జాతీయ రహదారుల అధికారుల్లోను వ్యక్తం అవుతోంది ముఖ్యంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ కూడా ఆకివీడు- దిగమర్రు జాతీయ రహదారిపై సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వల్లే 4 లైన్‌ల గ్రీన్ ఫీల్డ్ రహదారికి అంగీకరించినట్లు ప్రకటించారు. మొత్తం మీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా కసరత్తు జరుగుతోంది.

భీమ'వరం'

జాతీయ రహదారి- 165 జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణానికి వరం కానుంది. ఇప్పటి వరకు జిల్లా ఆర్థిక రాజధానిగా పేరు పొందిన భీమవరం ప్రధాన జాతీయ రహదారుల మార్గంలో లేదన్న భావన ఉంది. మారుమూలకు ఉన్నట్లు ఒక రకమైన భావన ఏర్పడింది. జాతీయ రహదారి నిర్మాణం పూర్తి అయితే భీమవరం పట్టణం కూడా ప్రధాన మార్గ స్రవంతిలోకి చేరనుంది.

మా హయంలోనే పూర్తి చేస్తా

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

జిల్లాలో ఏర్పాటు కానున్న ఫేజ్-2 జాతీయ రహదారి-165ను మా హయంలోనే పూర్తి చేస్తాం. ఈ సంవత్సరంలోనే టెండర్లు ప్రక్రియ పూర్తయ్యేలా ప్రయత్నిస్తున్నాం, రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రం సానుకూలంగా ఉంది. జాతీయ రహదారి నిర్మాణానికి కూడా పూర్తి మద్దతు ఇస్తోంది. జిల్లాలో భీమవరానికి అనుసంధానంగా ప్రధాన రహదారులను పూర్తి చేయ్యాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

శబరిమలైకు ప్రత్యేక రైళ్లు



» అరుణాచలం రైలు జనవరి వరకు పొడగింపు
» 15న నరసాపురం - సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు

నరసాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే నరసాపురం నుంచి పలు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. శబరిమలై యాత్రీకుల కోసం నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నారు. వీటితో నరసాపురం - సికింద్రాబాద్‌ల మధ్య శనివారం స్పెషల్ రైలు, ప్రస్తుతం నరసాపురం నుంచి నడుస్తున్న తిరువణ్ణామలై (అరుణాచలం) రైలును జనవరి వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జనవరి వరకు అరుణాచలం ...

నరసాపురం- తిరువన్నామలై మధ్య ప్రతి బుధవారం నడుస్తున్న నెం. 07219 స్పెషల్ రైలు గడువు ఈ నెలఖారుతో ముగిస్తుంది. దీనిని జనవరి నెలాఖరు వరకు పొడిగించింది. ప్రతి బుధవారం మధ్యాహ్నం 1 గంటకు నరసాపురంలో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 4 గంటలకు తిరువణ్ణామలై చేరి తిరిగి అక్కడ నుంచి 07220 నెంబరుతో మధ్యాహ్నం 11 గంటలకు బయలు దేరి తెల్లవారు జాము 2 గంటలకు నరసాపురం చేరుతుంది.

సికింద్రాబాద్‌కు...

హైద్రాబాద్‌కు ప్రయాణికుల రద్దీ పెరగడంతో శుక్రవారం నరసాపురం నుంచి సికింద్రాబాద్‌కు స్పెషల్ రైలు నడుపుతున్నారు. ఈ రైలు 07455 నెంబరుతో సాయంత్రం 6.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. జిల్లాలో ఈ స్పెషల్ రైలు పాలకొల్లు, భీమవరం, ఆకివీడు, కైకలూరు స్టేషన్‌లలో ఆగనుంది. గుంటూరు, నల్గొండ మీదుగు వెళ్లనుంది.

శబరిమలైకు..

జిల్లా నుంచి అయ్యప్పకొండకు వెళ్లే భక్తుల కోసం 07106 నెంబరుతో స్పెషల్ రైలు నడుపుతున్నారు. ఈ రైలు ఈ నెలలో 16, 23, 30, డిసెంబరులో 7, 14, 21, 28, జనవరిలో 4, 11, 18 తేదీల్లో కొల్లాంకు వెళ్లనుంది. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు కొల్లాంకు చేరుతుంది. తిరిగి కొల్లాంలో ప్రతి మంగళవారం మధ్యాహ్నం 2.30కి బయలుదేరి బుధవారం రాత్రి 7 గంటలకు నరసాపురం వస్తుంది. తిరుగు ప్రయాణంలో 07107 నెంబర్‌తో నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30, జనవరి 6, 13, 20 తేదీల్లో రానుంది.



తాడేపల్లిగూడెంలోని నన్నయ వర్సిటీ క్యాంపస్

సమస్యలతో సహవాసం

» సరిపడా లేని వసతి గృహాలు
» బస్సు సౌకర్యం లేక విద్యార్థుల పాట్లు
» పూర్వ విద్యార్థులకు అందని సర్టిఫికెట్లు
» తాడేపల్లిగూడెం నన్నయ క్యాంపస్ విద్యార్థుల దీన స్థితి

వారంతా పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు. ఎన్నో ఆశలతో యూనివర్సిటీ క్యాంపస్‌లో చదువుకునేందుకు వచ్చారు. అయితే సరిపడ వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. బయట వసతి పొందుతూ క్యాంపస్‌కు వచ్చేందుకు బస్సులు లేక కాలినడకే శరణ్యమవుతోంది. తాడేపల్లిగూడెంలోని ఆచార్య నన్నయ్య విశ్వవిద్యాలయ విద్యార్థుల దీన స్థితి ఇది.

(తాడేపల్లిగూడెం రూరల్-ఆంధ్రజ్యోతి)

పట్టణానికి దూరంగా ఉన్న ఈ క్యాంపస్‌కు రావాలంటే కనీసం బస్సు సౌకర్యం కూడా ఉండక పోవడం క్యాంపస్‌లో వసతి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు రోజూ కాళ్లకు పని చెప్పాల్సిందే. బాలికల కోసం హాస్టల్ ఏర్పాటు చేసినా అది క్యాంపస్‌లోని విద్యార్థులకు సరిపడా లేకపోవడంతో బయట హాస్టల్స్‌లో ఉండి రోజూ కిలోమీటర్ల మేర నడిచి రావాల్సిన పరిస్థితి. ఇదిలా ఉంటే క్యాంపస్‌లో బీ-ఫార్మసీ ప్రారంభ సమయంలో చదివిన విద్యార్థులకు నేటికీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి మూడు బ్యాచ్‌లకు సర్టిఫికెట్‌లు అందకపోవడంతో పూర్వ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

క్యాంపస్‌కు హాస్టళ్ల కొరత

భారీగా స్థలం అందుబాటులో ఉన్నా సరైన వసతి సదుపాయం లేక విద్యార్థులు క్యాంపస్‌లో ఇబ్బంది పడుతున్నారు. 150 మంది బాలికలకు హాస్టల్‌లో వసతి సదుపాయం ఉండగా 165 మంది వరకూ సర్దుకోవాల్సిన పరిస్థితి. మరో 150 మంది వరకూ బయట బీసీ హాస్టల్‌లో ఉంటున్నారు. వారితోపాటు బాలురు 150 మందికి హాస్టల్ అవసరం ఉంది. వీరంతా కాలినడకన క్యాంపస్‌కు రావాల్సిందే. అటు బస్సు సదుపాయం కూడా లేక ఇబ్బంది పడుతున్నారు.

ఫార్మసీలో సిబ్బంది కొరత

బీ-ఫార్మసి కళాశాలలో సిబ్బంది కొరత వేధిస్తోంది. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను బట్టి 12 మంది అధ్యాపకులు ఉండాలి. కాగా ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అధ్యాపకులు సర్దుకుని విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేటికీ రాని పీసీఐ సర్టిఫికెట్‌లు

ఎన్నో ఆశలతో క్యాంపస్‌లో బీ-ఫార్మసీ మొదలు పెట్టిన సమయంలో పూర్తిచేసిన 120 మంది విద్యార్థులకు నేటికీ సర్టిఫికెట్లు రాక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కొలువులు, పై చదువులు చదివేందుకు ఆ సర్టిఫికెట్ ప్రధానం. దీంతో విశ్వవిద్యాలయ అధికారుల చుట్టూ విద్యార్థులకు ప్రదక్షిణలు తప్పడంలేదు.

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధికి చెందిన ముదపాక సాయిరామ్ గతంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో స్పోర్ట్స్ దుకాణం నిర్వహించేవారు. ఆయన కుటుంబ అవసరాల నిమిత్తం నగరానికి చెందిన ఎం.సుధాకరరెడ్డి వద్ద 2022 అక్టోబర్ 17న రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నారు.ఆ బాకీ తీర్చే నిమిత్తం 2023 అక్టోబరులో రూ. 4.5 లక్షల చెక్కును సుధాకర్‌రెడ్డికి అందజేశారు. ఆ చెక్కును బ్యాంకులో జయచేయగా బౌన్స్ అయ్యింది.దీంతో బాధితుడైన సుధాకర్ రెడ్డి కోర్టులో కేసు వేయగా విచారణ చేపట్టారు. ఈ కేసు బుధవారం స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తుది విచారణను చేపట్టారు. బాధితుడి తరపున న్యాయవాది ఏపీఎస్ సూర్యారావు తమ వాదనలు వినిపించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ వివేక ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న యువకుడు రైలు బోగీ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన సుదిబోరో (30) చంగనూర్ నుంచి స్వగ్రామం వెళ్లేందుకు రైలు ఎక్కాడు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద ప్రమాద వశాత్తు జారిపడ్డాడు.. బుధవారం హెడ్‌కానిస్టేబుల్ పి.శ్రీనివాస రావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆధారాలను బట్టి అతడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

దెందులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకుని వాహనం సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేశారు. పెదపాడు గ్రామానికి చెందిన రాజశేఖర్ ఐషర్ వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా వాహనాన్ని పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. పెదపాడుకు చెందిన కాండ్రు రాజశేఖర్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

కమిషనర్ పేరుతో తహసీల్దార్‌కు ఫేక్ కాల్స్

మొగల్తూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్‌కు సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయం నుంచి అంటూ ఫేక్ కాల్ వచ్చింది. బుధవారం సాయంత్రం 5, 6 గంటల సమయంలో తహసీల్దార్ తన విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా సీసీఎల్‌ఏ కమిషనర్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామంటూ ఒకరు ఫోన్ చేశారు. పైఅధికారి కార్యాలయం నుంచి కాల్ అనడంతో తహసీల్దార్ రాజ్ కిశోర్ అడిగిన ప్రశ్నలకు మర్యాదపూర్వకంగా సమాధానం చెప్పారు. మీకు రాజమండ్రి ఎంత దూరమని ప్రశ్నించగా సుమారు 150 కిలో మీటర్ల దూరం ఉంటుందని చెప్పగా మొగల్తూరు జాతీయ రహదారి వెంబడి ఉంది కదా అన్నారు. అవును సర్ నరసాపురం, మచిలీపట్నం 216వ జాతీయ రహదారి ఉంది అన్నారు. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఎంతదూరమని అడగగా కిలోమీటరు ఉంటుందని తహసీల్దార్ సమాధానమిచ్చారు. ఒక సహాయం చేయాలని సూచించాడు. చెప్పండి సర్ ఆసుపత్రి వద్దకు తాను వెళ్తాను, సూచించిన వ్యక్తిని కలుస్తానని అన్నారు. కమిషనర్ కార్యాలయం ల్యాండ్ లైన్ నెంబర్ నుంచి కాల్ చేస్తానంటూ ఆ వ్యక్తి పెట్టేశారు. గత నెలలో కూడా ఇలాంటి కాల్ రావడంతో అప్రమత్తమై ఫేక్ కాల్‌గా గుర్తించి మాట్లాడినట్టు తహసీల్దార్ తెలిపారు.

బాల్య వివాహాలపై కఠినంగా ఉండాలి

బుట్టాయగూడెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ఐసీడీఎస్ సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతరాణి అన్నారు. బుధవారం బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పీఆర్.గూడెం, కేఆర్.పురం సెక్టార్లలో జరిగిన కార్యక్రమాల్లో పలు సూచనలు ఇచ్చారు. వివాహ వయస్సు వచ్చే వరకు వివాహాలు చేయరాదన్నారు. వర్కర్లు పనితీరును మెరుగుపర్చు కోవాలన్నారు. సీడీపీవో పద్మావతి సూపర్‌వైజర్లు వర్కర్లు పాల్గొన్నారు.

పాపం పండింది..

మూడేళ్ల తరువాత హత్య కేసులో అరెస్టు - రిమాండుకు తరలింపు
వైసీపీ నాయకురాలిగా చలామణి - బాధితులకు దక్కిన న్యాయం



కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ చంద్రశేఖర్‌లు

తణుకు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సవతి కుమార్తెకు చెందిన నాలుగు ఎకరాల భూమిని కాజేయాలనే ఉద్దేశంతో హత్య చేసి ఆపై అధికార పార్టీ అండతో మూడేళ్ల పాటు తప్పించుకుతిరిగిన వైసీపీ నాయకురాలిని, అమె భర్తను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. ఈ కేసుకు సంబంధించి సీఐ బి.కృష్ణకుమార్, ఎస్ఐ కె.చంద్రశేఖర్‌లు తెలిపిన వివరాల ప్రకారం తణుకు రూరల్ మండలం ముద్దాపురం గ్రామానికి చెందిన ముళ్లపూడి రూప, ఆమె భర్త ముళ్లపూడి శ్రీనులు కలిసి తన మొదటి భార్య కుమార్తె ముళ్లపూడి నాగహారికను ఆమేకు ఉన్న నాలుగు ఎకరాల భూమిని కాజేయాలనే దురుద్దేశంతో 2022 నవంబరు 11వ తేదీ రాత్రి సమయంలో నాగ హారికను తలపై రాడ్డుతో కొట్టి చంపి గదిలో ఉంచి పరుపుకు నిప్పు పెట్టి ఆమె కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో చనిపోయిందని అందరినీ నమ్మించారని తెలిపారు. నాగహారిక మృతిపై తమకు అనుమానాలున్నాయని హారిక అమ్మమ్మ, మేనమామలు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా అప్పటి పోలీసులు పట్టించుకోలేదు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కేసును నీరు గార్చేందుకు అప్పట్లో నాయకులకు, పోలీసులకు పెద్దమొత్తంలో నగదు చేతులు మారాయనే విమర్శలు కూడా వచ్చాయి. కానీ అప్పట్లో ఆమె వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా వ్యవహరించడంతో హారిక అమ్మమ్మ, మేనమామల ఆవేదన అరణ్య రోధనగానే మిగిలింది. దీనితో వారు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ బి.కృష్ణ కుమార్, ఎస్సై చంద్రశేఖర్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో జరిపిన విచారణలో హారికది హత్యగా నిర్ధారించి నిందితులుగా తండ్రి ముళ్లపూడి శ్రీను, సవతి తల్లి రూపలను అరెస్ట్ చేసి బుధవారం రాత్రి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి నిందితులకు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. నిందితురాలు ముళ్లపూడి రూప గతంలో వైసీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉండటంతో అధినాయకత్వం ఆశీస్సులతో దర్జాగా బయట తిరిగారు. వైసీపీ అధికారంలో ఉండగా మండలంలోని కోనాల, ముద్దాపురంలో పలు పనులు చేజిక్కించుకుని నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పీటీసీ సభ్యురాలిగా డమ్మీగా నామినేషన్ వేసి చివరి నిమిషంలో తానే అభ్యర్థినంటానని అసలు అభ్యర్థికి చుక్కలు చూపించినట్లు ముద్దాపురం గ్రామ కార్యకర్తలు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

భీమవరం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) రూమ్‌లోనే ఉరి వేసుకుని ఒక విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం రూరల్ ఎస్ఐ ఐ.వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన నిమ్మల హేమవర్షిణి (22)పట్టణంలోని కళాశాలలో బీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతుంది. కళాశాల సమీపంలోనే డ్రైవర్స్ కాలనీలో ముగ్గురు స్నేహితులతో కలిసి రూమ్ తీసుకుని ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం ముగ్గురు స్నేహితులు వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. ప్రస్తుతం హేమవర్షిణి ఒంటరిగా ఉంటుంది. బుధవారం ఉదయం హేమవర్షిణి తల్లి ఫోన్ చేయగా ఎంతసేపటికి తియ్యకపోవడంతో స్నేహితురాలికి ఫోన్ చేశారు. రూమ్‌లోకి కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని హేమవర్షిణి వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆమె తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు కూడా సమాచారం అందింది. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఐ.వీర్రాజు తెలిపారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ భవనం పైనుంచి పడి..

భీమవరం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ భవనం పైనుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమవరం మండలం రాయలంలో బీహార్‌కు చెందిన రామప్రవేశ సహాని (46) టైల్స్ పనులు చేస్తుంటాడు. మంగళవారం రాత్రి తాను ఉంటున్న నివాసంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ బిల్డింగ్ పై నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. అతని వద్ద పని చేసే గౌతమ్ కుమార్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి మాధవ కల్యాణమండప సముదాయంలోని వైజయంతి కల్యాణ మండపానికి లైటింగ్ వేసేందుకు ఎంఆర్‌ను కట్టించుకుని దాదాపు నెల రోజులు పాటు దేవస్థానానికి సొమ్ము జమ చేయనందుకు ఉద్యోగి ఎన్.అప్పన్నను ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి సస్పెండ్ చేశారు. గత నెల అక్టోబరు 11న ఎంఆర్ సుమారు రూ. 5,990 తన అకౌంట్‌ను సదరు ఉద్యోగి జమ చేయించుకున్నాడు. ఈ నగదును సొంత అవసరాలకు వాడుకుని మంగళవారం దేవస్థానానికి జమచేసినట్టు అధికారులు తెలిపారు.

అదృశ్యమైన 120 రోజులకు శవం లభ్యం

ముదినేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రులో 4నెలల క్రితం కనిపించకుండా పోయిన సంకురాత్రి తులసి మాధవరావు(60) మృతదేహం బుధవారం బయటపడింది. గ్రామంలో పిల్లులు పట్టేవారికి బొప్పన పూర్ణచంద్రరావుకు చెందిన పాడుబడిన పెంకుటింట్లో మృతదేహం కనిపించింది. దీంతో ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావుకు సమాచారం అందజేశారు. దుస్తుల ఆధారంగా మాధవరావుగా గుర్తించారు. మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తిపై కేసు

పెదవేగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం మధ్యాహ్నం డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా కవ్వగుంట గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు మద్యం మత్తులో ద్విచక్రవాహనం నడుపుతున్న పరీక్షల్లో తేలింది. అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదమని అన్నారు.

సీజ్ చేసిన మద్యం దుకాణంలో భారీ చోరీ



ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన మద్యం షాపులో దొంగలుపడి రూ.2 లక్షల విలువైన మద్యాన్ని అపహరించుకుపోయారు. ఏలూరు విజయ విహార్ సెంటర్ సమీపంలోని ఎస్ఆర్ వైన్ షాపులో ఇటీవల ఒక వ్యక్తి సిట్టింగ్ రూమ్ వద్ద మద్యం తాగి మరణించాడు. ఈ విషయాన్ని సకాలంలో అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, యధావిధిగా వ్యాపారా న్ని షాపు నిర్వాహకులు కొనసాగించడాన్ని ఎక్సైజ్ అధికారులు సీరియస్‌గా తీసుకుని షాపును సీజ్ చేశారు. 15 రోజులుగా అలాగే ఉండటంతో పరిస్థితిని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం రాత్రి షాపు నిర్వాహకులు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించారు. టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ద్వారకాతిరుమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ద్వారకాతిరుమలలో జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్.ఐ. టి.సుధీర్ తెలిపారు. గ్రామానికి చెందిన కనిగొళ్ల కాశీవిశ్వనాథం ఈ నెల 1న ఇంటికి తాళాలు వేసి కుటుంబ సమేతంగా బంధువుల ఇంటికి అశ్వారావుపేట వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో అదేరోజురాత్రి ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన దత్తి నవీన్, అతని స్నేహితులు తాడేపల్లిగూడేనికి చెందిన జి.సాయికిరణ్, కోనసీమ జిల్లా మండపేట మండలం కేతవరానికి చెందిన అరవింద్‌లు తాళాలు పగులకొట్టి ఇంట్లోని రెండుకాసుల బంగారం, రూ.1.70 లక్షలు నగదు తస్కరించారు. బుధవారం దొంగలను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

17 నుంచి కుష్ఠు వ్యాధి గుర్తింపునకు సర్వే

ఏలూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి గుర్తింపు, నిర్ధారణకు ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సర్వే నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని డివిజన్, మండల స్థాయిల్లో సర్వే జరగాలన్నారు. కుష్ఠువ్యాధిపై ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీశ్, డీఆర్డీఏ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా ఏలూరు : ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాను ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. రైతులకు మేలు చేయడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. గతంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఏలూరులో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. దాని ఫలితంగానే ఏలూరుకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ రాబోతుందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము 24 గంటల్లో జమ

పోలవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో కూటమి ప్రభుత్వం సొమ్ములు రైతు ఖాతాలకు జమచేయనున్నట్టు ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం పోలవరం మండలం పాతపట్టిసీమ, కొత్తపట్టిసీమ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దారు కంభంపాటి శ్రీనివాస్, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, నునకాని రాంబాబు, బొడ్డు కృష్ణ, నల్లా రాంబాబు, నునకాని దర్మేంద్ర, పూడి వెంకట్రావు రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ట్రైకార్ చైర్మన్ పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమాల్లో నిర్మించిన నూతన గృహప్రవేశాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హౌసింగ్ బిల్లులు సకాలంలో చెల్లిస్తుందన్నారు. నూతన గృహాలు కూడా త్వరలో విడుదలవుతాయన్నారు. నల్లా రాంబాబు, పాదం ప్రసాదు, పోతుల శ్రీను ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శీతాకాలంలో శ్వాసకోశ సమస్యలపై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ ఉన్న న్యుమోనియా వ్యాధిగ్రస్తులు చలివాతావరణంలో అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. బుధవారం స్థానిక కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలిగాలుల తీవ్రతవల్ల ప్రజలు, ముఖ్యంగా ఊపిరితిత్తుల సమస్య ఉన్నరోగులు దగ్గు, జలుబు, ఆయాసం, తుమ్ములతో బాధపడే అవకాశం ఉందన్నారు. శీతల పానీయాల జోలికి వెళ్లకపోవడమే ఉత్తమమన్నారు. శ్వాసకోశసంబంధిత వ్యాధితో బాధపడుతుంటే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శ్రీనివాసరావు, రామకృష్ణ, రమాదేవి, నీలాదేవి, వెంకటలక్ష్మి, సుమలత, అనురాధ, నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు. జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.

ఆరోగ్య పరిరక్షణలో మందుల పాత్రపై చర్చ

పెదపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్య పరిరక్షణలో మందుల (డ్రగ్స్) పాత్ర అనే అంశంపై పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం బుధవారం జరిగింది. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు మేరుగు శాంత కుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. హెటిరో సైక్లిక్ సమ్మేళనాలు - మందులు ఎంతగా ఉపయోగపడతాయో వివరించారు. ప్రిన్సిపాల్ సరళ, హిమ బిందు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మూర్తిరాజుకు ఘన నివాళులు

నిడమర్రు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతి పెద్ద గాంధీ స్మారక భవనాన్ని మ్యూజియంను నిర్మించి గాంధీ తత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా పనిచేసిన మూర్తిరాజు అందరికీ స్ఫూర్తి ప్రదాత అని సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు కొనియాడారు. బుధవారం నిడమర్రు మండలం పెదనిండ్రకొలను గ్రామంలో గాంధీ భవన్‌లో మాజీ మంత్రి సర్వోదయ మండలి నాయకులు చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు 13వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యాజ్యోతి - మూర్తిరాజు అవార్డులు అందించారు.

ఆపన్నులకు సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

ఏలూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో చికిత్స పొందుతున్న పలువురు రోగులకు ఏలూరుకు చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిదులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. టి.నరసాపురం మండలం కేతవరంలోని బి.రమేష్‌కు, ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలో నివసిస్తున్న విద్యార్థి ఎన్.శ్రీహర్షలకు రూ.పది వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్టు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మోహన్ తెలిపారు. సంస్థ సభ్యులు శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటరమణ, థామస్, ఆశీర్వాదం, ప్రకాష్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కోసమే సఖి సురక్ష

ఏలూరుటూటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణకు సఖీ సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మర్చెంట్ ఛాంబర్స్ కల్యాణ మండపంలో తల్లి సురక్ష కార్యక్రమాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో పాటు ప్రారంభించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ 35 సంవత్సరాలు పైబడిన మహిళలు ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థ సారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, నగర కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

గాడిన పడాలి

(5వ పేజీ తరువాయి)

పేరుతో వేరే సచివాలయాలకు వెళ్లారు. జీలుగుమిల్లి సచివాలయంలో తొమ్మిది మందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. సచివాలయ ఏఎన్ఎం, సర్వేయర్, వీఆర్వో బదిలీ కావడంతో వారి స్థానంలో కొత్త వారిని నియమించ లేదు. దీంతో అదనంగా ఇంటింటి సర్వే శాఖా పరంగా సిబ్బంది ఆన్‌లైన్ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఏలూరు రూరల్ తంగెళ్లమూడి సచివాలయం-2లో నలుగురు ఉద్యోగులున్నారు. వారిలో ముగ్గురు మాత్రమే సచివాలయంలో ఉండగా ఒకరు అవుట్ డోర్‌లో ఉన్నారు. పని భారం తగ్గించాలని, ఖాళీ ఉన్న పోస్టులు భర్తీ చేయాలని సిబ్బంది కోరుతున్నారు. వృద్ధులకు, వికలాంగుల పించన్ల పంపిణీ నుంచి పన్నుల వసూళ్లు, ప్రభుత్వం తీసుకొచ్చే యాప్‌ల ద్వారా పని చేయాల్సి వస్తోంది. ఈ సచివాలయ పరిధిలో ఏడు వేల మంది ఉండగా వీరి బాధ్యతంతా తామే చూడాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. జంగారెడ్డిగూడెంలో మహిళా పోలీసులకు సర్వేలు తప్ప సాధారణ విధులు పెద్దగా విధులు లేవు.

కలిదిండిలో రోడ్లపైనే దుకాణాలు

(5వ పేజీ తరువాయి)

బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి వెంబడి ఆక్రమణలతో ట్రాఫిక్ స్తంభించి బస్సులు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పండుగ వేళల్లో మరింత జనంతో రద్దీగా మారి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవటానికి మార్జిన్ లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆక్రమణల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు పలుమార్లు రాష్ట్ర రహదారి మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆక్రమణలు తొలగించిన దాఖలాలు లేవు. కలిదిండి సెంటర్‌లో రహదారి మార్జిన్ ఆక్రమించుకుని పూలు, పండ్ల దుకాణాలను కొనసాగిస్తున్నారు. కలిదిండి సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. నిత్యం రద్దీగా ఉండే రాష్ట్ర రహదారి ఆక్రమణలకు గురికావడంతో వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రాష్ట్ర రహదారి ఇరువైపులా వున్న అక్రమ దుకాణాలు, వెల్డింగ్ షాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం : అరవింద్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ

రాష్ట్ర రహదారి వెంబడి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్, సంబంధిత పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించటానికి చర్యలు తీసుకుంటాం.

నూజివీడులో మట్టి మాఫియా దందా

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు నూజివీడు మీడియాకు సమాచారం అందించారు. మీడియా రాకను గమనించిన మాఫియా వాహనాలను వెనక్కి తీసుకువెళ్లి తవ్వినచోటే మట్టిని పోసి ఖాళీ టిప్పర్లతో వెళ్లిపోయారు. గ్రామంలో ధ్వంసమైన రహదారుల గోతులను పూడ్చడానికి మట్టి తోలామని ఒకసారి, రైతు తన పొలంలో వున్న మట్టి దిబ్బను సరిచేయించటానికి తమను పిలవడంతో సదరు మట్టిని సరి చేస్తున్నామని మరోసారి పొంతన లేని సమాధానాలను అక్రమ మట్టి తోలకందారులు మీడియాకు తెలిపారు. గ్రామంలో ధ్వంసమైన మట్టి రహదారులను సరిచేయడానికి టిప్పర్లు మట్టితో రాష్ట్ర రహదారిపైకి రావాల్సిన అవసరం ఏమిటో అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాలేదు. నియోజకవర్గంలో అధికార పార్టీ చోటా మోటా నాయకుల ఆధ్వర్యంలో ఈ అక్రమాలు సాగుతున్నాయి. ఆగిరిపల్లి మండలంలో కనసనపల్లి, పోతవరప్పాడు, ఒంటి గ్రామాలలో బి ఫారం పట్టా భూములను స్థానిక నాయకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మైనింగ్ తెరవడానికి రంగం సిద్ధం చేశారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో పలు గ్రామాలలో రాత్రి వేళ అక్రమ మైనింగ్ ఇప్పటికే జరుగుతూనే ఉంది. అధికారులకు తెలిసినా ఎవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు.


మల్లాయిగూడెంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్


దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు


గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

వేడుకగా గృహ ప్రవేశాలు

ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

చింతలపూడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లాయిగూడెంలో బుధవారం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూడు లక్షల పేదల గృహాల ప్రారంభోత్సవాన్ని కడప జిల్లా రాయచోటిలో సీఎం చంద్రబాబు లాంచనంగా ప్రారంభించగా బుధవారం ఎమ్మెల్యే రోషన్‌కుమార్ నియోజకవర్గంలో ప్రారంభించి గృహ లబ్ధిదారుల కుటుంబాలకు నూతన వస్త్రాలు అందించి ఆశీర్వదించారు. సర్పంచ్ చీకటి కవిత, కూటమి నాయకులు రమేష్, గుత్తా వెంకటేశ్వరరావు, మట్టా సత్యనారాయణ, చీదరాల మధుబాబు, టి.చంద్రశేఖరరెడ్డి, శంకరరావు, చీకటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భువనపల్లిలో ఎమ్మెల్యే ధర్మరాజు ప్రారంభం

నిడమర్రు: అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. బుధవారం నిడమర్రు మండలం భువనపల్లి కాలనీలో ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన ఇంటిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు భువనపల్లిలో నూతనంగా నిర్మించిన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, హౌసింగ్ ఏఈ ఆలీముల్లా, నిమ్మల దొరబాబు, అల్లుమోలు అరుణ్ కుమార్, సంకు నాగేషు, సొసైటీ అధ్యక్షులు గోలి సాయి, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాదేపల్లిలో ఎమ్మెల్యే చంటి..

ఏలూరు టూటౌన్: అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చంటి అన్నారు. బుధవారం మాదేపల్లిలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లకు ఎమ్మెల్యే చంటి గృహప్రవేశాలు నిర్వహించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పైడి వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పూజారి నిరంజన్ పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

14న వందేమాతరం వేడుక

ఏలూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హిందూ యువజన సంఘం(వై.ఎం.హెచ్.ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 14న ఏలూరు వై.యం.హెచ్.ఏ హాల్లో బాలల దినోత్సవం, వందేమాతరం 150వసంతాల వేడుక నిర్వహిస్తున్నట్టు మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యర్రా సోమలింగేశ్వరరావు, కె.వి.సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యిరదల ముద్దు కృష్ణ, మజ్జి సూర్యకాంతారావు తెలిపారు. బుధవారం వైఎంహెచ్ఏ హాల్లో జరిగిన సమావేశంలో వేడుకలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, వందేమాతరం బృంద గేయాలాపన పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మేనేజ్‌మెంట్ సి.హెచ్.సాయి తేజ, జవ్వాజి మోహన్ విఠల్, ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

దెందులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఎ.వి.ఎన్.వి.ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని సోమవరప్పాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టిక్ అండ్ గ్రీన్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ అధికారులు బి.రామ్ పండు, శివగోపి విద్యా సామగ్రిని హెచ్ఎం సత్యనారాయణ, ఎంఈవో ప్రసాద్‌లకు అందజేశారు.

ఘనంగా లక్ష పత్రి పూజ

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా స్థానిక పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద లక్ష పత్రి పూజ, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి లక్ష పత్రిపూజ, జ్యోతిర్లింగార్చనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది.

గడ్డి కోత యంత్రం అందజేత

దెందులూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల హైస్కూల్ ఆవరణలో గడ్డి తొలగించేందుకు బోటని ఉపాధ్యాయురాలు కల్యాణి ఒక యంత్రాన్ని హెచ్ఎంకు అందజేశారు. డీఎస్ఎన్‌కే కల్యాణి రూ.3000 విలువైన యంత్రాన్ని హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఏలూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల షాట్ పుట్ క్రీడల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి ఈ నెల 19న జరగనున్న రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీలకు కల్యాణి ఎంపికయ్యారు.


జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ రహదారి పరిశీలన

ఏలూరు క్రైం/ద్వారకాతిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించారు. గుండుగొలను నుంచి ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వరకు రోడ్డును పూర్తిస్థాయిలో వివిధ శాఖాధికారులు బుధవారం పరిశీలించారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ బాబు, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ద్వారకావిఠల్, ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మీరావలి, డీటీఆర్బీ ఇన్‌చార్జి కానిస్టేబుల్ మధు, వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ బృందం గుండుగొలను, సీతంపేట అడ్డరోడ్డు, పోలసానపల్లి, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి, బుట్టాయగూడెం, కప్పలగుంట, లక్ష్మీనగర్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాద సూచనలు తెలిపే సైన్ బోర్డులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు.

బీఎల్‌వోల సమావేశం

పెదపాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కృష్ణజ్యోతి అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రా మాల బీఎల్‌వోల సమావేశం బుధవారం జరిగింది. ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో చిరునామా మార్పులు, మృతి చెందినవారు వంటి అంశాలను గుర్తించాలని ఓటరు జాబితాలను మ్యాపింగ్ చేయాలని అన్నారు.


శిక్షణకు హాజరైన కార్యదర్శులు

ముగిసిన శిక్షణ తరగతులు

కామవరపుకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లకు, సచివాలయ కార్యదర్శులకు పంచాయతీల ఆదాయాభివృద్ధి కోసం ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు సందర్భంగా ఎంపీడీవో బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఐక్యంగా గ్రామాభివృద్ధికి పని చేయాలన్నారు. ఈవోపీఆర్డీ సరళకుమారి, ఏవో సత్యవేణి, పంచాయతీ కార్యదర్శులు రెడ్డి సురేష్, జి.వెంకటరమేష్, జె.సుబ్బారావు, వి.రత్నకుమారి, వెంకట సత్యనారాయణ, బ్రహ్మయ్య, వి.రవి నాయక్, చందన, వి.జ్యోతిమేరి, సి.హెచ్.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐక్యతతోనే అభివృద్ధి సాధించవచ్చని,ప్రజా సమస్యల పరిష్కారంతో పంచాయతీ వ్యవస్థకు మంచి పేరు వస్తుందని స్పష్టం చేశారు.

● టి.నరసాపురం: పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదలపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండ్రోజుల పాటు జరిగిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో జి.మణి కుమారి మాట్లాడుతూ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంపొందించాలని అందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. రెండ్రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమంలో టీవోటీలు ఎన్.నాగలక్ష్మి, బి.శైలజ శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారం

పెదవేగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కార్యకర్తలు, నాయకులు పని చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని టీడీపీ గ్రామ, బూత్, యూనిట్, మండల స్థాయి అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులతో పెదవేగి మండలం దుగ్గిరాలలో బుధవారం సాయంత్రం నియోజకవర్గం పరిశీలకుడు చెన్నుపాటి గాంధీతో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీలో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ గ్రామ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన నాయకులు క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి ఐకమత్యంగా కృషి చేయాలన్నారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, శ్రీరాట్నాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, పార్టీ నాయకులు యూ.ఎస్.రామ్‌ప్రసాద్,ప్రభాకర్, బొప్పన సుధాకర్, ఈడ్పుగంటి అనిల్, తాతా సత్యనారాయణ, గుత్తా అనిల్, మోరు శ్రావణి, లావేటి శ్రీనివాసరావు, మోరు నాగరాజు, కొసరాజు వరప్రసాద్, పామర్తి నాగభూషణం, పెనుబోయిన మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

● భీమడోలు: భీమడోలులో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ, మండల స్థాయి కమిటీ సభ్యులు, బూత్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా కొనసాగుతున్న నిత్య భిక్ష

కామవరపుకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో స్వాములకు కొనసాగుతున్న నిత్య భిక్ష కార్యక్రమం బుధవారం 41వ రోజుకు చేరింది. స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని రామన్నపాలేనికి చెందిన రాయంకుల సత్యనారాయణ, నార్ని సాయి దుర్గాప్రసాద్, వీరిశెట్టిగూడేనికి చెందిన బొప్పన వీరశేఖరరావు-నాగశిరోమణి దంపతులు ఆర్థిక సేవలను అందించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వాములు, భవానీలు, శివస్వాములు, గోవింద స్వాములు కోలాహలంగా పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ నిత్య భిక్ష కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక బుధవారం నేపథ్యంలో స్థానిక సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ స్వామికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విభూదితో అలంకరణ నిర్వహించి భక్తజనానికి దర్శనమిచ్చారు. ఆలయ ఈవో సి.హెచ్.చిననాగేశ్వరరావు ఏర్పాట్లు చేశారు.

షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

పెదవేగి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూచింపూడిలోని షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పిరాట్ల సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తొలి రోజు బాబాకు మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, హారతులతో సాయిబాబాను కొలిచారు. అర్చకుడు సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ సాయి బాబా ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం హారతులతో బాబాను ఆరాధిస్తున్నట్టు తెలిపారు. కమిటీ సభ్యులు సూర్యనారాయణ, చీమల సుబ్బారావు, మల్లుల రామకృష్ణ, ముత్యాల రాజేశ్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై విచారణ జరిపించాలి

బుట్టాయగూడెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భాషా శ్యాంబాబు ఇంటిపై దాడిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధర్ముల సురేశ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.బుధవారం బుట్టాయగూడెం రామనర్సయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ వివాదాల నేపథ్యంలో శ్యాంబాబు కుటుంబాన్ని బెదిరించారని అన్నారు. కొందరు గిరిజనులు, బయట వ్యక్తుల ద్వారా ప్రాణహాని ఉన్నందున దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నాయకులు కారం రాఘవ, టి.బాబూరావు, ఈ.భూషణం, ఎస్.రామ్మోహన్, భాషా శ్యాంబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఏలూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం గుడివాక లంకలో పర్యటించి పరిశుభ్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. సీఈవో అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పలు విషయాలను విషయాలడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో నాగరాజ కుమారి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

భీమడోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):భీమడోలు మండలం పాతూరులోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏపీ ఆహార కమిషన్ సభ్యులు లక్ష్మారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార నిల్వలు ఉండరాదని సూచించారు. అనంతరం చిన్నారుల హాజరును పరిశీలించారు. ప్రధాన మంత్రి మాతృవందనం పథకంపై అవగాహన కల్పించాలన్నారు. రేషన్ దుకాణాలను, పాఠశాలలను ఆయన సందర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆగడాలలంక పరిధిలో చెట్లు తొలగింపు, కొత్త లైన్లు వేసే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. ఈ నెల 13న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆగడాల లంక, లక్ష్మీ పురం, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

గుడివాకలంక సబ్‌స్టేషన్ పరిధిలో మూడ్రోజులు..

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం, చాటపర్రు సెక్షన్‌లోని గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ప్రతికోళ్లలంక,పేదయాగనమిల్లి, కోమటిలంక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లింగంపాడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

భీమడోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భీమడోలు శివారు లింగంపాడు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ధర్మరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భీమడోలు శివారు లింగంపాడు గ్రామం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే ధర్మరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటా

లింగపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం జూబిలీనగర్ వద్ద ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్పరాజుగూడెం గ్రామానికి చెందిన వీరంకి ప్రవీణ్‌కుమార్ కుటుంబాన్ని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ బుధవారం పరామర్శించారు.ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యులను అన్ని విధాలా ఆదుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శివయ్యకు ఘనంగా లక్ష బిల్వార్చన

ఏలూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శనివారపుపేటలోని చెన్నకేశవ స్వామి కోవెలలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక లక్ష బిల్వార్చన చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. మహిళలు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా శివ నామస్మరణతో మార్మోగింది.

పన్నులు వసూలు చేయాలి

బుట్టాయగూడెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని జంగారెడ్డిగూడెం డీఎల్‌డీవో ఎం.రాజు కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో జరిగిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీల పురోగతికి పన్నుల వసూళ్లు ముఖ్యమన్నారు. అనేక పంచాయతీల్లో పన్నులు వసూలు సక్రమంగా జరగడం లేదన్నారు. అన్ని రకాల పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని సూచించారు. అలాగే స్వమిత్వ సర్వేను విజయవంతం చేయాలన్నారు. ఎంపీడీవో కె.జ్యోతి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ కార్యదర్శులు పాల్గొన్నారు.



క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

బుట్టాయగూడెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తిని పెంచుకోవాలని, క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని బుట్టాయగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.యు.వి.ఎన్.మనేంద్రరావు అన్నారు. తమ కళాశాలలో డిగ్రీ చదువుతున్న జి.ఉదయ్ కిరణ్ అనే విద్యార్థి ఆదికవి నన్నయ్య వర్సిటీ స్థాయిలో లాంగ్ అండ్ హై జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించి కళాశాలకు మంచి పేరు తెచ్చాడన్నారు. మెడల్ సాధించిన విద్యార్థిని బుధవారం ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు ఎం.వెంకటేశ్వరరావు, పీడీ వి.శ్రీనివాస్, కె.శ్రీను, డా.కె.శాంతిబాబు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని లక్కవరం గ్రంథాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ పఠాన్ అన్వర్‌బాషా కోరారు. ఈ మేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో చిత్ర లేఖనం, వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన

ఏలూరుఅర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఔషధాల సంశ్లేషణలో హెటెరోసైక్లిక్ కాంపోనెంట్స్ ప్రాధాన్యత అనే అంశంపై బుధవారం స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో అతిథి ఉపన్యాసం జరిగింది.వృక్ష జాతుల్లో ఉన్న మెడిసిన్ వివరాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శాంతకుమారి తెలియజేశారు. కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్ యలమర్తి బాబు, అధ్యాపకులు రాము, మూర్తి, ప్రవీణ్ కుమార్, రజని, లక్ష్మీ ప్రియాంక పాల్గొన్నారు.



మర్యాద పూర్వక సత్కారం

పోలవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన కమిషనర్ సదా భార్గవి, ఏపీ ట్రైకార్ డైరెక్టర్ మణి కుమారిలను బుధవారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి తమ శాఖకు సంబంధించిన పలు సమస్యలు వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేత భుక్యా విజయనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా తాగునీరందిస్తాం

ఏలూరుటూటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవిలో పుష్కలంగా తాగు నీరు అందిస్తామని నగర కమిషనర్ కె.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు అన్నారు. గోదావరి జలాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పంపే మోటార్లు పాడవడంతో 150 హెచ్‌పీ సామర్థ్యంతో నూతన మోటార్లు కొనుగోలు చేసి బుధవారం ప్రారంభించామన్నారు. ఎంఈ సురేంద్రబాబు, డీఈ నారాయణరావు, ఏఈలు పవన్, సాయి, కె.నర సింహరావు, ఎస్.శ్రీనివాస్‌రావు, డీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు అవసరం

కుక్కునూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారి ఆశా హెచ్ఎంలకు సూచించారు. స్థానిక జడ్పీ పాఠశాలను ఆయన పరిశీలించారు. టెన్త్ పరీక్షల వేళ నిర్వహించే సెంటర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఈవో రామన్నదొర, ఎంఈఓలు కృష్ణప్రసాద్, గిరిభవాన్‌దాస్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఏలూరు క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు వసంతమహల్ దగ్గర టూ వీలర్స్ ఆటో కన్సల్టెంట్స్ ఫైనాన్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తలసీ మియా బాధితుల కోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం సంతోకరమన్నారు. అసో సియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం చేసిన యువకులకు అభినందనలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ సూరిబాబు, సెక్రటరీ ధర్మేష్, రెడ్‌క్రాస్ పీఆర్‌వో కె.వి.రమణ పాల్గొన్నారు.

ఎక్సైజ్ వాహనాల వేలం

నూజివీడు టౌన్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాల వేలం పాటను బుధవారం నిర్వహించారు. మొత్తం 31 వాహనాలను వేలంలో ఉంచగా 27 వాహనాలను 1,67,100 రూపాయలకు పాడుకున్నారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ పాండురంగా రావు, సీఐ ఎ. మస్తానయ్య ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో పట్టుబడిన సారాను ధ్వంసం చేశారు.



వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే సస్పెండ్ చేస్తా: కలెక్టర్

నూజివీడు, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి, రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. ఓపీ విభాగంలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించకపోవడం, ఆసుపత్రిలో అపారిశుధ్యం, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయకపోవడం, ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసూతి, లేబర్ వార్డులలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రి నిర్వహణలో సరైన పర్యవేక్షణ లేకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి ఆర్ఎంఓ ల నుంచి వివరణ తీసుకోవాలని డీసీహెచ్ఎస్‌ని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అత్యున్నత వైద్య సేవలందించాలని ఆధునిక వైద్య పరికరాలు, ఆధునిక బెడ్స్‌ను ఆసుపత్రికి ప్రభుత్వం సమకూరిస్తే వాటిని వినియోగించకుండా స్టోర్‌లో నిరుపయోగంగా ఉంచడంపై కలెక్టర్ డీసీహెచ్ఎస్ డా.పాల్ సతీష్, ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మజపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్ళీ తనిఖీకి వస్తానని అప్పటికీ పనితీరును మెరుగుపరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డీసీహెచ్ఎస్ డా.పాల్ సతీష్, ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కామేష్, తహసీల్దార్‌లు బద్రు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజనోత్సవాల్లో శ్రీ సిద్ధార్థ ప్రతిభ



నూజివీడు టౌన్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజనోత్సవాల్లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ తెలిపారు. ఏలూరులో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలకు చెందిన బి. లీల కృష్ణ, మనోజ్ఞ కూచిపూడి డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్ విభాగాల్లో జిల్లా ద్వితీయ స్థానం సాధించారు. సీహెచ్ నిఖిల ఎలక్యూషన్ విభాగంలో జిల్లా తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. వీరిని కళాశాల డైరెక్టర్ డా.రవిబాబు, అధ్యాపకులు అభినందించారు.

ఇంటి వద్దే చిరు పరిశ్రమలు

నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం విశ్రాంత కమర్షియల్ ట్యాక్స్ అధికారిని బత్తుల బాల కోటేశ్వరి అన్నారు. నూజివీడు మసీద్ సెంటర్ ప్రాంతంలో ఐద్వ ఆధ్వర్యంలో మహిళలకు ఇంటి వద్ద నిర్వహించుకునే గృహ పరిశ్రమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ కార్యదర్శి నందూరి పద్మాంజలి, నాయకులు షేక్ జైడాబి, మద్దాలి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయానికి ప్రింటర్ వితరణ

మండవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండవల్లి-1 స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన పిట్టా ప్రతాప్‌కుమార్ ఎంఈఓ కార్యాలయానికి ప్రింటర్‌ను బుధవారం వితరణ చేశారు. ఎంఈఓ-1 సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండవల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కానుకొల్లు ఆర్ఎస్‌కే పరిధిలోని అల్లినగరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కూటమి నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ప్రారంభించారు. మండల వ్యవసాయ అధికారి జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని సుమారు 4300 ఎకరాల్లో వరిసాగు జరిగిందని, సుమారు 12 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని ఆశిస్తున్నామని తెలిపారు. ఆరుదల అయ్యేవరకు ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టాలని సూచించారు. కూటమి నాయకులు బోయిడి సురేష్, నారగాని కొండా, ఎలికే రాంబాబు, సర్పంచ్ జంపన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ

ముసునూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో విశాఖలో జరిగిన మహిళల అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీల్లో రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తరపున ఆడిన టి.నాగసుధ, డి.జెస్సీలు అత్యుత్తమ ప్రదర్శన కనబరచి రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచినట్టు పీడీ వాకా నాగరాజు తెలిపారు. విద్యార్థులను బుధవారం పాఠశాల హెచ్ఎం రామకృష్ణారావు, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీ నాయకుడు నాగేశ్వరరావు మృతి

ఆగిరిపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అంగిరేకుల నాగేశ్వరరావు బుధవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ మంగయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ నాయకులు సర్నాల సాంబశివరావు, ఉలస శ్రీనివాసరావు, తదితరులు నివాళులు అర్పించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

ముసునూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముసునూరు నగరకాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త పోట్రు భూపతిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం బాధిత కుటుంబాన్ని టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబుతోపాటు స్థానిక టీడీపీ నాయకులు పరామర్శించారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు రూ. 5 వేలు నగదును బాధిత కుటుంబానికి అందజేశారు.

బెల్టు షాపులపై దాడులు

కైకలూరు: బెల్టు షాపులపై దాడులు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ తెలిపారు. బుధవారం శృంగవరప్పాడు, పందిరి పల్లిగూడెం, కొట్టాడలో దాడులు జరిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



వేమవరప్పాడులో లబ్ధిదారుని ఇంటి గృహప్రవేశం అనంతరం తాళం అందజేస్తున్న కూటమి నేతలు

జిల్లాలో 15 వేల గృహ ప్రవేశాలు

» జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి » కోలాహలంగా 'మన ఇల్లు-మన గౌరవం'..
» లబ్ధిదారులకు సత్కారం » సొంతింటి కల సాకారమే కూటమి లక్ష్యమన్న నాయకులు

నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'మన ఇల్లు - మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా నూజివీడు గొడుగువారి గూడెంలోని లబ్ధిదారు తురకా అంకమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బుధవారం ఒక్కరోజే 15,024 నూతన గృహ ప్రవేశం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కొత్తగా ఇండ్లు మంజూరు కొరకు లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సంబంధిత గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం లబ్ధిదారు దంపతులకు నూతన వస్త్రాలను కలెక్టర్ అందజేశారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మున్సిపల్ కమిషనర్ వేరయ్య, గృహ నిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ, స్థానిక కౌన్సిలర్ సీతాదేవి, సత్యనారాయణ, కృష్ణకుమారి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదవాడికి సొంతిల్లు సామాజిక హోదా

చాట్రాయి: సొంతిల్లు కలిగి ఉండటం పేదవాడికి సామాజిక హోదా అని, అటువంటి హోదాను ప్రతి పేదవాడికి అందించటానికి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతున్నదని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 3 లక్షల పక్కా ఇళ్ళు ప్రారంభోత్సవంలో భాగంగా, బుధవారం చాట్రాయి మండలం ఆరుగొలనుపేటలో ఇజ్జిగాని నాగేశ్వరరావు, జనార్దనవరంలో గుర్రాల రమేష్, సూరంపాలెంలో బూబత్తుల కిషోర్ నూతన ఇళ్ళను నాయకులు, అధికారులు నూతన గృహ ప్రవేశాలు చేయించారు. లబ్ధిదారులను సత్కరించారు. ఎంపీడీవో సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, కూటమి నాయకులు పలగాని దుర్గారావు, పానుగళ్ళ కోటేశ్వరరావు, తుమ్మల జగన్, ద్రోణంరాజు శ్రీనివాసరావు, ఆదిమూలం శర్మ, నక్కా రాము, పరసా శ్రీను, బలుసూరి రత్తయ్య, మాదిరాజు ప్రసాద్, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు. నరసింహారావుపాలెం శివారు సి. గుడిపాడులో బుధవారం కాతారి సీమోనుతో ఆయన నూతన గృహాన్ని కూటమి నాయకులు గృహప్రవేశం చేయించి దంపతులను సన్మానించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కట్టా నాగ దుర్గారావు, మాజీ సర్పంచ్ గార్లపాటి మారేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు: పేదలకు సొంతిల్లు కూటమి లక్ష్యమని నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. బుధవారం వేమవరప్పాడులో లబ్ధిదారులు నిర్మించిన ఇళ్లలోకి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 470 మంజూరు కాగా అందులో 62 ఇళ్ళు పూర్తి చేసి గృహప్రవేశాలు చేస్తున్నారు. వీటిలో వేమవరప్పాడులో 7 ఇళ్ళు మంజూరు కాగా 4 ఇళ్ళకు గృహప్రవేశాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.1.80లక్షలు నిర్మాణానికి మంజూరు చేసింది. దీంతో నిర్మాణ దశలో నిలిచిపోయిన గృహాలన్నీ లబ్ధిదారులు పూర్తి చేసుకున్నారు. కో-కన్వీనర్ విజయలక్ష్మి, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కోటప్రోలు కృష్ణారావు, పొత్తూరి వాసురాజు, బోడావుల జగదీష్, గ్రామ టీడీపీ నేతలు బోయిన గోవర్ధన, బోడావుల వసంతరావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: పేదవాడి ఇంటి కలను నేరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని 16 పంచాయతీల్లో సాముహిక గృహప్రవేశాలను కూటమి నాయకులు, అధికారులు బుధవారం పండుగలా నిర్వహించారు. ముసునూరులో రెండు నూతన ఇళ్ళను టీడీపీ నాయకులతో కలిసి రఘుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన 223 ఇళ్ళకు సకాలంలో బిల్లులు వేయకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలను పూర్తిచేసుకోలేక పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి కృషితో బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ 75లు నగదును అదనంగా ఇచ్చి, పెండింగ్ బిల్లులను చెల్లించడంతో ఇళ్ళ నిర్మాణాలు పూరైయ్యాయని అన్నారు. లబ్ధిదారులను సన్మానించి, స్వీట్లు అందజేశారు. వేంపాడు డీసీ ఛైర్మన్ రావర్ల బాలకృష్ణ, బలివే ఆలయ ఛైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గార్లపాటి నరసింహారావు, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, పీఏసీయస్ అధ్యక్షులు దేవినేని శ్రీధర్, తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుగొలనుపేటలో గృహ లబ్ధిదారులకు సన్మానం

ఆగిరిపల్లి: పేదల సొంతింటి కల నెరవేరిందని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్. వేణు అన్నారు. పీఎంఏవై కింద మండలంలో 132 గృహ ప్రవేశాలు జరిగాయి. బుధవారం నూతన గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు ఎంపీడీవో బి బార్గవి, వేణు, నెక్కలం గొల్లగూడెం, చొప్పర మెట్ల గ్రామంలో లబ్ధిదారులతో కలిసి నూతన గృహ ప్రవేశాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులను సత్కరించారు. నెక్కలం గొల్లగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కాజ కుటుంబరావు, మాజీ సర్పంచ్ నాదల సాంబయ్య, పానుగంటి గోపి, చొప్పరమెట్ల సర్పంచ్ కురాకుల ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరు 3వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు



హనుమంతులగూడెం సచివాలయంలో ఖాళీగా ఉన్న సీట్లు



జనార్ధనవరం సచివాలయంలో ఒక్కరే విధులు

గాడిన పడాలి

(5వ పేజీ తరువాయి)

పేరుతో వేరే సచివాలయాలకు వెళ్ళారు. జీలుగుమిల్లి సచివాలయంలో తొమ్మిది మందికి ఆరుగురు మాత్రమే ఉన్నారు. సచివా లయ ఏఎన్ఎం, సర్వేయర్, వీఆర్వో బదిలీ కావడంతో వారి స్థానంలో కొత్త వారిని నియమించ లేదు. దీంతో అదనంగా ఇంటింటి సర్వే శాఖా పరంగా సిబ్బంది ఆన్‌లైన్ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఏలూరు రూరల్ తంగెళ్లమూడి సచివాలయం-2లో నలుగురు ఉద్యోగులున్నారు. వారిలో ముగ్గురు మాత్రమే సచివాలయంలో ఉండగా ఒకరు అవుట్ డోర్‌లో ఉన్నారు. పని భారం తగ్గించాలని, ఖాళీ ఉన్న పోస్టులు భర్తీ చేయాలని సిబ్బంది కోరుతున్నారు. వృద్ధులకు, వికలాంగుల పింఛన్ల పంపిణీ నుంచి పన్నుల వసూ ళ్ళ, ప్రభుత్వం తీసుకొచ్చే యాప్‌ల ద్వారా పని చేయాల్సి వస్తోంది. ఈ సచివాలయ పరిధిలో 7 వేల మంది ఉండగా వీరి బాధ్యత తామే చూడాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. జంగారెడ్డిగూడెంలో మహిళా పోలీసులకు సర్వేలు తప్ప సాధారణ విధులు పెద్దగా లేవు.

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తుంది. సోమవారం కైకలూరులో గ్రామ సచివాలయాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. మండలంలో 22 గ్రామ సచివాలయాలకు గాను 4 సచివాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తుంది. కొల్లేరు గ్రామాలైన శృంగవరప్పాడు, పందిరిపల్లిగూడెం, పెంచికలమర్రు, కొట్టాడ గ్రామాల సచివాలయాల్లో 9మంది సిబ్బందికి గాను ఇద్దరు లేక ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయా గ్రామాల్లోని అధికారులు వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. మండలంలో 196మంది సచివాలయాల సిబ్బంది ఉండగా 160 మంది విధులు నిర్వహిస్తుండగా 36 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బందితో ప్రతి నెలా ప్రభుత్వం పెన్షన్లు పంపిణీ మొదటి రోజే 90శాతం పూర్తిచేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లపై పనిభారం ఎక్కువగా పడుతోంది. పూర్తిగా ప్రక్షాళన చేస్తే ఎవరి విధులు వారికి అప్పగించినట్లయితే అన్నిరకాల సేవలు సత్వరమే ప్రజలకు అందుతాయి.

ముదినేపల్లి: మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో సుమారు 220 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, 50 నుంచి 60 శాతం మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ముదినేపల్లి గ్రామ పంచాయతీని రెండు సచివాలయాలుగా ఏర్పాటు చేసినా పూర్వపు పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలోనే రెండు సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముదినేపల్లి రెండు సచివాలయాల్లో 20 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, 12 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో గ్రామ సర్వేయర్‌లు మండల సర్వేయర్ నియంత్రణలో ఉండగా, ఏఎన్ఎంలు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్ల పరిధిలో పని చేస్తున్నారు. దీంతో సచివాలయాలకు ఆ ఉద్యోగులు రాక అరుదే. కొన్ని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కలిదిండి: మండలంలో మొత్తం 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 138 మంది సచివాలయ ఉద్యోగులకు గాను 100 మంది మాత్రమే ఉన్నారు. సచివాలయాల్లో కీలక పోస్టు అయిన డిజిటల్ అసిస్టెంట్ 11 సచివాలయాల్లో ఖాళీగా ఉంది. దీంతో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవటానికి విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లపై తమ బాధ్యతలతోపాటు అదనపు బాధ్యతలు పడటంతో పని భారంతో ఒత్తిడికి గురవుతున్నారు. పెదలంక గ్రామ సచివాలయంలో కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. మిగిలిన సుమారు ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుమారు ఐదేళ్లుగా ఇన్‌చార్జ్‌లతో కాలం వెళ్లబుచుతున్నారు. అన్ని పనులను వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే చేస్తుండటంతో పని భారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా 176 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 104 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారు. గోపవరం-1లో 11 మంది సిబ్బందికి నలుగురు, గోపవరం-2లో ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ముసునూరు-1లో నలుగురు, ముసునూరు-2 లో ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉన్నట్లు తేటతెల్లమైంది. ముఖ్యంగా రీ-సర్వేకు గ్రామ సర్వేయర్లను వినియోగిస్తుండటంతో భూ సమస్యలపై సచివాలయాలకు వస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

చాట్రాయి: జనార్ధనవరం సచివాలయంలో మహిళా పోలీస్ ఒక్కరే విధుల్లో ఉన్నారు. ఇక్కడ వెల్ఫేర్ అసిస్టెంట్, సర్వేయర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిజిటల్ అసిస్టెంట్ 2 నెలలు సెలవు పెట్టారు. వీఆర్వో, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు ఫీల్డ్‌లో ఉన్నారు. ఏఎన్ఎం హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కి మండల పంచాయతీ రాజ్ ఏవో ఇన్‌చార్జి బాధ్యతలు ఉండటంతో ఆయన ఫీల్డ్‌కి వెళ్ళారు. పంచాయతీ కార్యదర్శి ఒక పూట సెలవు పెట్టి మధ్యాహ్నం సచివాలయానికి వచ్చారు. చిత్తపూరు-1 (ఆరుగొలనుపేట) సచివాలయంలో కేవలం 5 పోస్టులే ఉండగా, డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు విధుల్లో ఉన్నారు. వీఆర్వో ఫీల్డ్‌లో, అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతు సేవా కేంద్రంలో ఉన్నారు. చిత్తపూరు-2 సచివాలయంలో 5 పోస్టులు ఉండగా డిజిటల్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు విధుల్లో ఉన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ స్కూల్స్ విజిట్‌కి వెళ్ళి 11.35కి సచివాలయానికి వచ్చారు. మహిళా పోలీస్ సెలవులో ఉన్నారు. సర్వేయర్ ఫీల్డ్‌లో ఉన్నారు. మండలంలో 16 సచివాలయాల పరిధిలో 177 పోస్టులు ఉండగా కేవలం 82 మందే పనిచేస్తున్నారు. ప్రజలకు ఎక్కువ అవసరం ఉండే డిజిటల్ అసిస్టెంట్లు 16 మందికి 7గురు, వెల్ఫేర్ అసిస్టెంట్లు 16 మందికి 13 మంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 16 మందికి 5గురు మాత్రమే పని చేస్తున్నారు. బదిలీలలో ఎక్కువ మంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. కానీ ఇక్కడకు తక్కువ మంది రావటంతో సిబ్బంది కొరత ఏర్పడింది. ఎవరికి ఎక్కువ పని భారం లేదు. పని తక్కువ ఉన్న ఉద్యోగులతో కూడా అన్ని పనులు చేయిస్తుండటంతో పని భారం సమస్య పెద్దగా లేదు. రెగ్యులర్ ఎంపీడీవో లేక సచివాలయాలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని పలువురు అంటున్నారు.

ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళ్తారో?

నూజివీడు టౌన్: ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా మారుతోంది. నూజివీడు మండల పరిధిలో సచివాలయం వ్యవస్థ పనితీరుపై ఆంధ్రజ్యోతి హనుమతుల గూడెం సచివాలయాన్ని సందర్శించింది. మొత్తం 8 మంది ఉద్యోగస్తులకు గాను కేవలం ఇద్దరే నిర్ణీత 11 గంటల సమయానికి హాజరయ్యారు. సచివాలయంలో మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉండవలసి ఉండగా గత కౌన్సిలింగ్‌లో వీఆర్వో ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో దిగవల్లి, తూర్పు దిగవల్లి సచివాలయ సిబ్బందిని ఇన్‌చార్జులు గా నియమించారు. మరోవైపు హనుమంతుల గూడెం సర్వేయర్‌ను వెంకటరాయపాలెంకు డిప్యూటేషన్‌పై పంపగా వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో అనే పరిస్థితి నెలకొని ఉంది. హనుమంతుల గూడెం సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ కార్యదర్శి, మహిళా పోలీసులు ఆంధ్రజ్యోతి విజిట్ సమయంలో కార్యాలయంలో కనిపించలేదు. ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్‌ను వివరణ కోరగా వారు మిట్టగూడెం గ్రామం డిప్యుటేషన్‌పై వెళ్లారన్నారు. కేవలం డిజిటల్ అసిస్టెంట్ మురళి, వెటర్నరీ అసిస్టెంట్ ప్రీతి మాత్రం కార్యాలయంలో ఉండగా సెక్రటరీ, మహిళా పోలీసులు ఫీల్డ్ వర్క్‌లో ఉన్నారని స్థానికంగా ఉన్న సిబ్బంది పేర్కొన్నారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని చివరికి సిబ్బందికి ఫోన్ చేస్తే ఫలానా సమయంలో రమ్మని పేర్కొంటున్నారని హనుమంతుల గూడెం గ్రామస్థులు వాపోతున్నారు.

మండవల్లి: లోకుమూడి సచివాలయంలో సరిపడ అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ సమయపాలన పాటించడం లేదు. ఆంధ్రజ్యోతి 10గంటలకు కార్యాలయానికి వెళ్లినప్పటికీ 11గంటల వరకు మొక్కుబడిగా రాకపోకలు సాగించినట్లు కనిపించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ పనులపై వెళ్లినట్లు పేర్కొంటున్నారు.

ప్రైవేటీకరణతో పేదలకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బుధవారం నూజివీడులో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద, బడుగు, బలహీన వర్గాలు వైద్య విద్యను అభ్యసించడం కష్టతరం అవుతుందని, కూటమి నాయకులు తమ జేబులు నింపుకునేందుకు చూస్తున్నారని ఆరోపించారు.

అంత్యక్రియలకు వైష్ణవి సాయం

ముదినేపల్లి: ముదినేపల్లిలో భిక్షాటన చేసుకుంటూ పోల్‌రాజ్ కెనాల్ గట్టుపై ఒంటరిగా నివశిస్తున్న యాచకురాలు మానికల దుర్గమ్మ (62) బుధవారం ఉదయం మర ణించింది. అనారోగ్య కారణాలతో ఈ యాచకురాలు మరణించగా, ఆమె అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ.5 వేలు నగదు సహాయం అందజేశారు. వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మృతురాలి సన్నిహితులకు అందజేశారు.

కలిదిండిలో రోడ్లపైనే దుకాణాలు

(5వ పేజీ తరువాయి)

బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి వెంబడి ఆక్రమణలతో ట్రాఫిక్ స్తంభించి బస్సులు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పండుగ వేళల్లో మరింత జనంతో రద్దీగా మారి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవటానికి మార్జిన్ లేకపో వటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆక్రమణల వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు పలుమార్లు రాష్ట్ర రహదారి మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు గుర్తించి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆక్రమ ణలు తొలగించిన దాఖలాలు లేవు. కలిదిండి సెంటర్ లో రహదారి మార్జిన్ ఆక్రమించుకుని పూలు, పండ్ల దుకాణాలను కొనసాగిస్తున్నారు. కలిదిండి సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. రద్దీగా ఉండే రాష్ట్ర రహదారి ఆక్రమణలకు గురవడంతో వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ దుకాణాలు, వెల్డింగ్ షాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

రాష్ట్ర రహదారి వెంబడి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్, సంబంధిత పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించటానికి చర్యలు తీసుకుంటాం.
- అరవింద్, ఆర్అండ్‌బీ ఏఈఈ

నూజివీడులో మట్టి మాఫియా దందా

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు నూజివీడు మీడియాకు సమాచారం అందించారు. మీడియా రాకను గమనించిన మాఫియా వాహనాలను వెనక్కి తీసుకువెళ్లి తవ్వినచోటే మట్టిని పోసి ఖాళీ టిప్పర్లతో వెళ్లిపోయారు. గ్రామంలో ధ్వంసమైన రహదారుల గోతులను పూడ్చడానికి మట్టి తోలామని ఒకసారి, రైతు తన పొలంలో వున్న మట్టి దిబ్బను సరిచేయించటానికి తమను పిలవడంతో సదరు మట్టిని సరి చేస్తున్నామని మరోసారి పొంతన లేని సమాధానాలను అక్రమ మట్టి తోలకందారులు మీడియాకు తెలిపారు. గ్రామంలో ధ్వంసమైన మట్టి రహదారులను సరి చేయడానికి టిప్పర్లు మట్టితో రాష్ట్ర రహదారిపైకి రావాల్సిన అవసరం ఏమిటో అన్న ప్రశ్నకు వారి నుంచి సమాధానం రాలేదు. నియోజకవర్గంలో అధికార పార్టీ చోటా మోటా నాయకుల ఆధ్వర్యంలో ఈ అక్రమాలు సాగుతున్నాయి. ఆగిరిపల్లి మండలంలో కననపల్లి, పోతవరప్పాడు గ్రామాల్లో బి ఫారం పట్టా భూములను స్థానిక నాయకులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి మైనింగ్ తెరవడానికి రంగం సిద్ధం చేశారు. నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో పలు గ్రామాలలో రాత్రి వేళ అక్రమ మైనింగ్ ఇప్పటికే జరుగుతూనే ఉంది. అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడటం లేదు.

సచివాలయాల తనిఖీ

నూజివీడు టౌన్: వెంకటాయపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించారు.

అదృశ్యమైన 120 రోజులకు శవం లభ్యం

ముదినేపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలపర్రులో 4 నెలల క్రితం కనిపించకుండా పోయిన సంకురాత్రి తులసి మాధవరావు (60) అనే వ్యక్తి మృత దేహం బుధవారం బయటపడింది. గ్రామంలో పిల్లులను పట్టేవారు తిరుగుతుండగా బొప్పన పూర్ణచంద్రరావుకు చెందిన పాడుబడిన పెంకుటింట్లో మృత దేహాన్ని కనుగొని గ్రామస్థులకు తెలియచేయగా వారు ముదినేపల్లి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆరా తీసి ఈ ఏడాది జూన్ 29న కనిపించకుండా పోయిన మాధవరావు కుటుంబీకులను పిలిపించగా పూర్తిగా కుళ్ళిన మృతదేహాన్ని దుస్తుల ఆధారంగా గుర్తించారు. మృత దేహాన్ని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

నూజివీడు టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పెద్ద చెరువు వద్ద అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. 10 రోజుల క్రితం పట్టణానికి చెందిన అక్బర్ బాషా (65) అదృశ్యమయ్యాడు. కాగా బహిర్భూమికి వెళ్ళి ప్రమాదవశాత్తు మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.